
రైతులు అడ్డుకుంటున్నా లెక్కచేయకుండా చేపట్టిన ప్రొక్లెయిన్‌తో చేస్తున్న పనులు

మైండ్ మనీ గేమ్

విజయవాడ వెస్ట్ బైపాస్‌లో దారుణాలు

రూ. 32.58 కోట్ల పనుల కోసం రూ.300 కోట్ల రైతుల ఆస్తికి ఎసరు!

- నాలుగింటితో పోయేదానికి 11 టవర్లకు పెంపు
- అడ్డగోలుగా అర్ధ చంద్రాకారపు అలైన్‌మెంట్
- పాత్రధారి 'మేఘా'.. సూత్రధారి ఎన్‌హెచ్ ఆర్‌వో ఆఫీసు!
- ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్ రూపొందించిన రైతులు
- తక్కువ నష్టం, వ్యయంతో పనులు పూర్తికి అవకాశం
- స్టే ఇచ్చినా ఆగని పనులు

విజయవాడ వెస్ట్ బైపాస్ నిర్మాణ పనుల వ్యవహారంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైటెన్షన్ లైన్ల సమస్య పరిష్కారానికి జక్కంపూడి పంచాయతీ భూముల్లో నాలుగు ట్రాన్స్ మిషన్ టవర్లు వేస్తే సమసిపోయేదానిని పదకొండు టవర్లతో సమస్యను పెంచుతున్నారు. రెండు చోట్ల టవర్లను మార్చితే సరిపోయేదానికి.. రైతుల భూములు, ప్రజల ప్లాట్ల చుట్టూ అర్ధ చంద్రాకారంగా మలుపులు తిప్పుతున్నారు. రూ.32 కోట్ల పని కోసం రూ.300 కోట్ల విలువైన ప్రజల ఆస్తిని కాలరాస్తున్నారు. ఈ మైండ్ అండ్ మనీ గేమ్‌కు పాత్రధారులు మేఘా సంస్థ నిర్వాహకులు అయితే, సూత్రధారులు మాత్రం ఎన్‌హెచ్ రీజనల్ ఆఫీసు అధికారులు అని రైతుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి.


మంగళవారం రహదారిపై రైతులను అడ్డుకుంటున్న ప్రత్యేక బలగాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ /విజయవాడ రూరల్) : విజయవాడ వెస్ట్ బైపాస్ పనుల నేపథ్యంలో టవర్ల అలైన్‌మెంట్ మార్పు విషయంలో రైతుల అంగీకారం లేకుండానే వారి పొలాల్లో నుంచి అర్ధచంద్రాకారంలో 11 టవర్స్ వేసే విధంగా అలైన్‌మెంట్ ఖరారు చేసి, ఏకంగా పనులు కూడా మొదలు పెట్టారు. వందలాది మంది పారామిలటరీ పోలీసులను రంగంలోకి దించి మరీ పనులు చేస్తున్నారు. అడ్డుకున్న రైతులపై భౌతిక దాడులకు దిగుతూ అరెస్టులు చేస్తున్నారు. ఈ అర్ధచంద్రాకారపు అలైన్‌మెంట్ ప్రకారం పనులు చేయాలనుకుంటే ఆయా భూములు కలిగిన రైతులతో సంప్రదించి వారికి సమాచారాన్ని తెలియపరిచి వారి అంగీకారాన్ని తీసుకున్న తర్వాతనే చేయాల్సి ఉంటుంది. దీనికి భిన్నంగా రైతులకు విషయం తెలియకుండా, ప్లాట్లదారులకు తెలియపరచకుండా అలైన్‌మెంట్‌ను ఫిక్స్ చేయటం మొదటి తప్పు. రైతుల భూములు, ప్రజల ప్లాట్లను తమ సొంత జాగీరులాగా వారి అనుమతు లేకుండా అడ్డగోలుగా పనులు చేస్తున్నారు. ఈ అలైన్‌మెంట్‌కు సంబంధించి టవర్ల పనులను కూడా ప్రస్తుతం బైపాస్ పనులను చేస్తున్న మేఘాకే అప్పగించారు.

రైతులపై మేఘా, పోలీసుల దాదాగిరీ!

ల్యాంకో తరఫున కాంట్రాక్టు సంస్థ మేఘా, కొత్తపేట పోలీసులు రైతుల మీద దాదాగిరీ చేస్తున్నారు. మేఘా సంస్థ రూ.32 కోట్ల పని కోసం రూ.300 కోట్ల విలువైన భూములు, ప్లాట్లు కలిగిన మిగతా 6లో..


మచిలీపట్నం మండలంలో లారీకి ఎత్తుతున్న ధాన్యం బస్తాలు

ధాన్యం విక్రయాలు ముమ్మరం

తేమశాతం ఆధారంగా మద్దతు ధర

వాతావరణశాఖ హెచ్చరికలతో జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరమయ్యాయి. యంత్రాల ద్వారా వరికోతలు పూర్తి చేసిన రైతులు ధాన్యం విక్రయించే పనిలో నిమగ్నమయ్యారు. కూలీల ద్వారా వరికోతలు పూర్తి చేసిన చోట పంటను కుప్పలు వేయడం, నూర్పిడి చేయడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. తేమశాతం ఆధారంగా బస్తాకు రూ.1,450 నుంచి 1600 వరకు అన్నదాతలకు ధర లభిస్తోంది. రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది నేటికీ మధ్యవర్తుల మాటనే వింటూ ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఐదు రోజులుగా వాతావరణం అనుకూలంగా ఉండటంతో కూలీల ద్వారా వరి కోతలను రైతులు కోయించారు. మళ్లీ వర్షం కురుస్తుందనే హెచ్చరికలతో వరి కోతలను తాత్కాలికంగా వాయిదా వేసే ఆలోచనలో రైతులు ఉన్నారు.

బస్తాకు రూ.1,450 నుంచి 1600 వరకు విక్రయం

- రెండు రోజుల పాటు కోస్తా తీరంలో వర్షం కురిసే అవకాశం
- ధాన్యం కొనుగోలులో అధికారుల తీరుపై ప్రభుత్వానికి నివేదిక!

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో యంత్రాల ద్వారా వరికోతలు పూర్తి చేసిన రైతులు గత నాలుగైదు రోజులుగా ధాన్యంలో తేమశాతం తగ్గించేందుకు ఆరబెడుతున్నారు. తేమశాతం ఆధారంగా బస్తాకు రూ.1450 నుంచి 1600 వరకు ప్రస్తుతం మద్దతు ధర లభిస్తోంది. ఒక్కో సంచిలో ధాన్యం కాటా వేసే సమయంలో 41.300 గ్రాములను కాటావేసి, రైతులకు 40 కేజీలుగానే లెక్కచూపుతున్నారు. లారీలోకి ధాన్యం ఎత్తాక బస్తాకు 76 కిలోలను లెక్కగా చూపుతుండటంతో రైతులకు ఈ రూపంలో బస్తాకు రూ.75 మేర కోతపడుతోంది. దీంతో పాటు కాటా కూలీ, ధాన్యం రవాణాఖర్చులు రైతులే భరించాలని మధ్యవర్తులు, మిల్లర్లు మెలిక పెడుతున్నారు. ధాన్యంలో తేమశాతం తగ్గేకొద్ది ఎకరానికి 28 బస్తాల నుంచి 32 బస్తాల మధ్య దిగుబడి వస్తోంది. బయటి వ్యాపారులు అధికధరకు ధాన్యం కొనుగోలు చేయకుండా నేటికీ మధ్యవర్తులు తమదైన శైలిలో చక్రం తిప్పుతున్నారని, దీంతో బీపీటీ-5204 రకం ధాన్యం తేమశాతంతో పనిలేకుండా బస్తాను రూ.1700లకు విక్రయించాల్సి ఉండగా, రూ.1400 నుంచి 1450 విక్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్లు నవంబరు 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. నవంబరు, డిసెంబరు నెలల్లో ఫెంగల్ తుఫాను ప్రభావంతో వాతావరణం అనుకూలంగా లేకపోవడం, రైతుల నుంచి ధాన్యం సకాలంలో కొనుగోలు చేయకపోవడం, ఇతర జిల్లాలకు ధాన్యం పంపేందుకు అధికారులు సకాలంలో అనుమతులు ఇవ్వకపోవడంతో రైతులు రోడ్డెక్కారు. దళారులు కుమ్మక్కై ధాన్యం మద్దతు ధర పెరగకుండా తొక్కిపెట్టడంతో రైతులు ఇబ్బందుల పాలయ్యారు. పెనమలూరు, పెడన, పామర్రు తదితర నియోజకవర్గాలలో ధాన్యం కొనుగోలుకు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు కలగజేసుకోవాల్సి వచ్చింది. సీఎం సూచనలతో మంత్రి నాదెండ్ల మనోహర్, పౌరసరఫరాలశాఖ కమిషనర్ వీరపాండియన్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు సర్దిచెప్పాల్సి వచ్చింది. రైతులు మిల్లర్లకు మధ్య ధాన్యం మద్దతు ధర నిర్ణయంలో వాదనలు చోటు చేసుకున్నాయి. దీంతో జిల్లాలో ధాన్యం కొనుగోలులో సరైన చర్యలు చేపట్టని అధికారుల తీరుపై శాసన సభ్యులు ఆరా తీసి, ప్రభుత్వానికి నివేదిక పంపేందుకు రంగం సిద్ధం చేశారు. గత మూడు రోజులుగా తమ అనుచరుల ద్వారా ఈ వివరాలను సేకరించే పనిలో శాసన సభ్యులు, కూటమి నాయకులు ఉన్నారు.

ప్రభుత్వానికి ప్రజాప్రతినిధుల నివేదిక?

ఎన్టీఆర్ 2.. కృష్ణా 3

రాష్ట్ర స్థూల విలువ జోడింపులో ర్యాంకుల పంట

- ఎన్టీఆర్ జిల్లా రూ.69,123 కోట్ల స్థూల విలువ (జీవీఏ - 5.65%) జోడింపు
- కృష్ణాజిల్లా రూ.64,118 కోట్ల స్థూల విలువ (5.24%) జోడింపు
- సేవా రంగంలో రాష్ట్రంలోనే ఎన్టీఆర్‌కు 2వ, కృష్ణాకు 5వ స్థానం
- పారిశ్రామిక రంగంలో ఎన్టీఆర్‌కు 5, కృష్ణాకు 16వ స్థానం

6లో

మార్కెట్ యార్డు కమిటీలపై కూటమి నేతల చూపు!

6లో

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

6లో

నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- కృష్ణా తరంగ్‌లో మంత్రి రవీంద్ర

వసూల్ రాజాపై వేటు

మద్యం దుకాణాలకు టార్గెట్ పెట్టి మరీ ఈఎస్ టాస్క్‌ఫోర్సు సీఐ నిక్సన్ వసూళ్లు

- ప్రత్యేక కథనం ప్రచురించిన ఆంధ్రజ్యోతి
- విచారణలో నిజమని తేలడంతో చర్యలు తీసుకున్న ఆ శాఖ ఉన్నతాధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) కృష్ణాజిల్లా ఎక్సైజ్‌శాఖలో టాస్క్‌ఫోర్సు సీఐగా పనిచేస్తున్న నిక్సన్‌ను సస్పెండ్ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో నడిచే ఈ టాస్క్‌ఫోర్సు విభాగంలో సీఐగా విధులు నిర్వహిస్తున్న నిక్సన్ మద్యం దుకాణదారులను వేధించి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఆంధ్రజ్యోతి 'ఎక్సైజ్‌శాఖలో వసూల్ రాజా!' శీర్షికతో ప్రత్యేక కథనం సోమవారం ప్రచురించింది. దీనిపై ఆశాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ప్రాథమిక విచారణలో ఆయనపై వచ్చిన ఆరోపణలు వాస్తవమేనని తేలడంతో ఆయన్ను సస్పెండ్ చేశారు.



ఆధిపత్య పోరు

హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు వర్సెస్ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

క్రమబద్ధీకరించాలని సీఎం చంద్రబాబుకు వినతి

హౌసింగ్ కార్పొరేషన్‌లో సుమారు పదిహేనేళ్లుగా వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు హౌసింగ్ విభాగంలో క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు. రెండు రోజుల కిందట కానూరుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చిన సందర్భంలో హౌసింగ్ కార్పొరేషన్ సిబ్బంది ఆయన్ను కలిశారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని అభ్యర్థించారు. లేదంటే కాంట్రాక్టు ఉద్యోగులుగా పరిగణించాలని కోరారు. దీనిపై చంద్రబాబు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన అడ్డగోలు విధానాల వల్ల సజావుగా సాగే వ్యవస్థలు వివాదాలకు కేంద్రాలుగా మారుతున్నాయి. ఇందుకు గృహనిర్మాణశాఖలో సాగుతున్న ఆధిపత్య పోరే అద్దం పడుతోంది. గృహ నిర్మాణాలకు దరఖాస్తులు, మంజూరు బాధ్యత హౌసింగ్ కార్పొరేషన్‌కు, నిర్మాణాల పరిశీలన, బిల్లుల బాధ్యత గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కట్టబెట్టడంతో గొడవ మొదలైంది. అది ఒకరిపై మరొకరు పెత్తనం చేసుకునే వరకు వెళ్లింది. ఫలితంగా గృహ నిర్మాణాల పురోగతి దారి తప్పింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతైనా ఈ గొడవ సర్దుమణుగుతుందని భావిస్తే.. ఆరు నెలలు కావస్తున్నా కూడా ఎలాంటి మార్పులు చేయకపోవటంతో యథాస్థితి కొనసాగుతోంది. గృహ నిర్మాణం ఊపందుకోవటానికి ప్రభుత్వం టార్గెట్స్ నిర్దేశించినా క్షేత్ర స్థాయిలో పనులు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి నిలిపితే తప్ప క్షేత్రస్థాయిలో గృహ నిర్మాణం ఊపందుకునే పరిస్థితి కనిపించడంలేదు.

దరఖాస్తుల స్వీకరణ, మంజూరు బాధ్యత ఒకరిది..

- నిర్మాణాల పరిశీలన, బిల్లుల చెల్లింపుల అధికారం మరొకరికి..
- ఇరువర్గాల సమన్వయ లోపంతో లబ్ధిదారులకు తప్పని అవస్థలు
- వైసీపీ ప్రభుత్వంలో తెచ్చిన అడ్డగోలు విధానాల వల్లే సమస్య
- కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గత టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని క్షేత్ర స్థాయిలో పరుగులు పెట్టించారు. అప్పట్లో గృహ నిర్మాణ శాఖ ఒక్కటే ఈ పనులను పర్యవేక్షించటమే దీనికి ప్రధాన కారణం. వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఐదు శాతం కూడా నిర్మాణ పనులు పురోగతిలో లేవు. వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే దీనికి కారణం. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి గృహ నిర్మాణ శాఖతో పాటు, గ్రామ సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సమాన అధికారాలు కల్పించారు. గృహ నిర్మాణ శాఖ సిబ్బంది దరఖాస్తులను స్వీకరించి, రుణాలు మంజూరు చేస్తే.. ఇళ్ల పురోగతిని బట్టి బిల్లు చెల్లింపుల వ్యవహారాలను సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు చూసేవారు. హౌసింగ్ కార్పొరేషన్ ఒక్కటే చేయాల్సిన బాధ్యతలను విడగొట్టి అప్పగించటం వల్ల సమస్యలు తలెత్తాయి. సకాలంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు బిల్లులు పెట్టకపోవటం వల్ల వాటి చెల్లింపులో తీవ్ర జాప్యం నెలకొనేది. బిల్లులు సకాలంలో రాక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గృహ నిర్మాణ శాఖ అధికారుల దగ్గర మొరపెట్టుకునేవారు. బిల్లు చెల్లింపులు ఇంజనీరింగ్ అసిస్టెంట్ల చేతుల్లో ఉండటం వల్ల అవి కదిలేవి కావు. హౌసింగ్ కార్పొరేషన్‌లో ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నా కూడా క్షేత్ర స్థాయిలో పనులు చేయటానికి అవుట్ సోర్సింగ్‌లో పనిచేసే సిబ్బంది ఎక్కువగా ఉన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా గత 15 ఏళ్లకు పైగా హౌసింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 300 మంది పనిచేస్తున్నారు. వీరికి చాలా అనుభవం ఉంది. టిడ్కో ఇళ్లు పరుగులు పెట్టడంలో వీరి కృషి ఎంతో ఉంది. వీరంతా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులన్న కారణంగా సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వారిని చిన్నచూపు చూస్తున్నారు. హౌసింగ్ కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్ సిబ్బందితో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లేవారు కాదు.

గ్రామ సచివాలయాల్లో తాత్సారం

హౌసింగ్ కార్పొరేషన్ సిబ్బంది నిర్ణీత సమయంలో ఎప్పటికప్పుడు డేటా అప్‌లోడ్ చేసినా బిల్లు చెల్లింపు విషయాల్లో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తాత్సారం చేసేవారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల జాబ్ చార్ట్ వేరుగా ఉంటుంది. సచివాలయాల పరిధిలో జరిగే నిర్మాణాలను పర్యవేక్షణ చేసే అధికారం వరకు వీరికి ఇచ్చి ఉంటే హౌసింగ్ సిబ్బంది, సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్ల మధ్యన పనిలో పోటీ తత్వం పెరిగేది. అధికారాలను సమంగా పంచటం వల్ల ఒకరి మీద ఒకరు పెత్తనం చేసుకునే పరిస్థితి ఏర్పడింది. తమకు బిల్లులు రావటం లేదని లబ్ధిదారులు హౌసింగ్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేస్తుండటంతో.. వాటికి సంబంధించి హౌసింగ్ సిబ్బంది సచివాలయ సిబ్బందికి నివేదించటం చేస్తున్నారు. బిల్లు చెల్లింపులపై తమకు రికమండ్ చేయటాన్ని సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సహించలేకపోతున్నారు. అవుట్ సోర్సింగ్ సిబ్బంది తమకు చెప్పేదేమిటి అన్నట్టుగా వ్యవహరించటం వల్ల క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1280 మంది వరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

తెరపైకి హౌసింగ్‌లో విలీనం డిమాండ్

గ్రామ,వార్డు సచివాలయాల పరిధిలో పనిచేసే ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తాజాగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల మిగతా 6లో..

నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



» కృష్ణా తరంగ్‌లో మంత్రి రవీంద్ర

వన్‌టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యువతలో ప్రతిభను వెలికితీసి వారికి బంగారు భవిష్యత్తు కల్పించడమే కూటమి ప్రభుత్వ ఆకాంక్ష అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. యువతకు సుస్థిర ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఆయన పేర్కొన్నారు. కేబీఎన్ కళాశాలలో కృష్ణా విశ్వ విద్యాలయాల ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల కృష్ణాతరంగ్-2024 యువజనోత్సవం మంగళవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరగనున్న యువజనోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి దార్శనికతలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం యువతకు బంగారు భవిష్యత్తు ఇవ్వాలన్న లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ సెన్సెస్‌ను తీసుకుంటున్నట్టు తెలిపారు. యువతలో నైపుణ్యాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధన దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈనెల 7న మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ మ్యారీటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, కృష్ణా యూనివర్శిటీ వైస్ చాన్సలర్ (ఇన్‌చార్జి) ఆర్.శ్రీనివాసరావు, రెక్టార్ ఎం.వి.బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ కె.శోభన్‌బాబు, కృష్ణాతరంగ్ కన్వీనర్ ఎం.కోటేశ్వరరావు, కేబీఎన్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ తూనుగుంట శ్రీనివాస్, ప్రిన్సిపాల్ జి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



పామకుమాడులో రోడ్డుపక్కన ఆరబోసిన ధాన్యపురాశులను పరిశీలిస్తున్న రైతుసంఘాల నేతలు

తేమశాతం నిబంధనలు సడలించాలి

» రైతు సంఘాల డిమాండ్

ఉంగుటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం న్యాయబద్ధంగా వ్యవహరించాలని, తేమశాతం నిబంధనలను సడలించి రైతుకు పూర్తిస్థాయి మద్దతు ధర చెల్లించాలని కౌలురైతుసంఘం, వ్యవసాయకార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మండలంలోని ఆముదాలపల్లి, పొణుకుమాడు, గారపాడు గ్రామాల్లో మంగళవారం వరికోతలు కోసిన పొలాల్లో వారు పర్యటించారు. కల్లాలు, రోడ్లపక్క ధాన్యపు రాశులను పరిశీలించి ధాన్యం కొనుగోళ్లపై ఆరాతీశారు. ఆరురోజుల క్రితం వరికోతమిషన్(హార్వెస్టర్)తో కోతకోయించి ధాన్యంకొనుగోలు కేంద్రాల్లో మచ్చు చూపిస్తే ధాన్యంలో 27శాతం తేమ వుందని, 17శాతం వుంటేనే పూర్తిస్థాయిలో డబ్బులు పడతాయని, లేదంటే కటింగ్ అవుతాయని చెప్పి పంపించేస్తున్నారని, ఏదైనావుంటే మిల్లర్లతో మాట్లాడుకోమని చెబుతున్నారని నేతలకు వివరించారు. మబ్బుల వాతావరణంతో వారంరోజులు ఎండబెట్టినా ధాన్యంలో తేమశాతం తగ్గట్లేదని రైతులు వాపోయారు. కౌలురైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తెల్లాకుల వెంకట లక్ష్మణస్వామి, వ్యవసాయకార్మిక సంఘం జిల్లాకార్యదర్శివర్గ సభ్యుడు అజ్మీర్ వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ పీపీసీ కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు, దళారులు సిండికేట్‌గా ఏర్పడి పంటకు గిట్టుబాటుధర దక్కకుండా చేస్తున్నారని, బస్తాకు రూ.1300 మాత్రమే చెల్లించి కష్టాన్ని దోపిడీ చేస్తున్నారనే సందేహాలు రైతుల్లో వ్యక్తమౌతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి, తేమశాతం పేరుతో రైతులను ఇబ్బందిపెట్టకుండా, దళారుల మాయనుంచి రైతులను రక్షించాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి కడవకొల్లు రామరాజు, కౌలురైతులు సాలి శంకరరావు, పడమట సత్యనారాయణ, తాటిపాముల శంకరరావు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు బంగారు గాజుల కానుక

వన్‌టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా, గుంటుపల్లికి చెందిన పెదర్ల హర్షిత్‌కుమార్, కుటుంబసభ్యులు అమ్మవారి అలంకరణ నిమిత్తం 11.5 గ్రాముల రెండు బంగారు బంగారు గాజులను కానుకగా అందజేశారు. మంగళవారం డిప్యూటీ ఈవో రత్నరాజును కలిసి బంగారు గాజులు కానుకను అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వారికి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందచేశారు. వేద పండితులు ఆశీస్సులు అందచేశారు.



దుర్గమ్మకు బంగారు గాజులు అందజేస్తున్న దాతలు

● మొగల్రాజపురానికి చెందిన పునుమల్లి శ్రావణి, ఓం ప్రకాష్‌లు కుటుంబసభ్యులతో ఆలయానికి విచ్చేసి అన్నవితరణ నిమిత్తం అధికారులను కలిసి రూ.1,00,116లను చెక్కు రూపంలో అందజేశారు. దర్శనానంతరం వీరికి ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందచేశారు. వేద పండితులు ఆశీస్సులు అందచేశారు.

ఆధిపత్య పోరు

(5వ పేజీ తరువాయి)

తాతయ్యబాబును కలిసి తమను హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో విలీనం చేయాలని విజ్ఞప్తి చేయటం చర్చనీయాంశంగా మారింది. హౌసింగ్ విభాగంలో కీలక విధులను తామే నిర్వహించటం వల్ల తమను ఆ విభాగంలోకి విలీనం చేయాలన్న డిమాండ్ తీసుకువచ్చారు. ఇది కాస్తా హౌసింగ్ కార్పొరేషన్‌లో దశాబ్దంన్నర కాలంగా పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి పుండు మీద కారం చల్లినట్టు అయ్యింది. తమకు ఉద్యోగ అభద్రతను కల్పిస్తున్నారని ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై గుర్రుగా ఉన్నారు. దీంతో వీరి మధ్యన మరింత గ్యాప్ ఏర్పడింది. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను తీసుకున్న ఉద్దేశం వేరు. వారి జాబ్ చార్ట్ వేరు. దీనికి భిన్నంగా సచివాలయాలను వదిలేసి హౌసింగ్ విభాగంలోకి వచ్చేయాలని ప్రజా ప్రతినిధులను కలవటంతో .. ఉభయుల మధ్యన వివాదం మరింత ముదురుతోంది.

స్వర్ణాంధ్ర-2047కు శ్రీకారం

13న ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

» కార్యక్రమానికి హాజరుకానున్న 25వేల మంది

» ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వేదికగా ఈనెల 13న ముఖ్యమంత్రి చంద్రబాబుచే స్వర్ణాంధ్ర-2047కు శ్రీకారం చుట్టడం జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే సభకు సుమారు 25 వేల మంది హాజరుకానున్నారని, జిల్లా అధికారులు సమన్వయంతో కార్యక్రమం విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 13వ తేదీన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమ ఏర్పాట్లపై కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం వీడియో కాన్ఫరెన్సు హాలులో జిల్లా అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టనున్నారన్నారు. సభకు ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి సుమారు 25 వేలమంది ప్రజలు, విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. దీనికోసం 500 బస్సుల ఏర్పాటుకు ట్రాన్స్‌పోర్టు ఏపీఆర్‌డీటీ అధికారులు వాహనాల సమీకరణ చేయాలన్నారు. వేదిక, బారికేడ్ల నిర్మాణ పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు పర్యవేక్షించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా వాహనాల పార్కింగ్, బందోబస్తు ఏర్పాట్లు చేసేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పార్కింగ్ ఏరియాలలో తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా ఏర్పాట్లను మున్సిపల్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చేపట్టాలన్నారు. వేదిక స్టాల్స్ అలంకరణ, పర్యవేక్షణ జిల్లా ఉద్యాన అధికారి చేపట్టాలని తెలిపారు. కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారిగా, మున్సిపల్ కమిషనర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని, ఏర్పాట్లపై ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణమే తన దృష్టికి తెవాలని కలెక్టర్ కోరారు.





అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, పాల్గొన్న అధికారులు

సమావేశంలో జేసీ నిధి మీనా, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, డీసీపీ గౌతమి శాలిని, డీఆర్వో లక్ష్మీ నరసింహం, ఆర్డీవో చైతన్య, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, జిల్లా ఉద్యాన అధికారి బాలాజీ కుమార్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, డీఈవో యువీ సుబ్బారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ఎస్.వి.సాగర్, డీసీవో శ్రీనివాసరెడ్డి, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ జె.సుమన్, జిల్లా పౌరసరఫరాల అధికారి టి.సతీష్, సీపీవో వై.శ్రీలత, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయకుమారి పాల్గొన్నారు.



స్టేడియంలో ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

స్టేడియంలో ఏర్పాట్ల పరిశీలన..

ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వేదిక ఏర్పాటుతో పాటు పబ్లిక్ గ్యాలరీ, వీఐపీ గ్యాలరీ, ట్రాఫిక్, బందోబస్తు, వివిధ ఇతివృత్తాలతో ఏర్పాటు చేయాల్సిన స్టాళ్లు, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ తదితరాలపై సూచనలు చేశారు.

చోరీ నిందితుల కోసం గాలింపు ముమ్మరం

వత్సవాయి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : డబ్బాకుపల్లి చోరీ ఘటనలో నిందితుడి కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఇంటి తాళం పగలగొట్టి రూ.36.50 లక్షలు చోరీ చేసిన నిందితులు ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది. సొమ్ముతో పాటు పక్కన మరికొంత నగదు, పావు కేజీ బంగారం ఉన్నప్పటికీ ఆగంతకులు వాటి జోలికి వెళ్లకపోవడంతో గ్రామస్థులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాధితుడు ఎస్.కె బడేసాహేబ్ 25 సంవత్సరాలుగా వత్సవాయిలో మెకానిక్ షాపు పెట్టుకొని జీవిస్తున్నాడు. సోమవారం ఆయన డ్యూటీకి వెళ్లగా, భార్య అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లింది. ముగ్గురు పిల్లలు పాఠశాలకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇద్దరు కుమార్తెల పెళ్లిళ్ల చేయాలని దాచిన సొమ్మును దోచుకెళ్లారని బాధితుడు బుడే సాహెబ్ వాపోయాడు. పోలీసులు క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. అడిషనల్ ఎస్పీ రామారావు, నందిగామ ఏసీపీ తిలక్, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సైలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సామాన్యుడి సొంతింటి కల సాకారం

» రైజ్ ఎన్ రైజ్ చైర్మన్ ఉప్పలపాటి ఉదయభాస్కర్‌రాజు

అజిత్‌సింగ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సామాన్యుడి సొంత ఇంటికల నెరవేర్చడమే లక్ష్యమని రైజ్ ఎన్ రైజ్ చైర్మన్ ఉప్పలపాటి ఉదయభాస్కర్ రాజు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ రైజ్ ఎన్ రైజ్ ఏడో వార్షికోత్సవం విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి గ్రామంలో మంగళవారం ఘనంగా జరిగింది. కస్టమర్లు, సంస్థ డైరక్టర్లు, వ్యాపారవేత్తలు, నగర ప్రముఖులు, మార్కెటింగ్ సిబ్బంది, రైతుల సమక్షంలో జరిగిన వేడుకల్లో సంస్థ చైర్మన్ ఉప్పలపాటి ఉదయభాస్కర్‌రాజు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, రియల్ ఎస్టేట్ రంగంలో పదేళ్ల అనుభవంతో 12 వెంచర్లను దిగ్విజయంగా సామాన్య ప్రజలకు అందించామన్నారు. అమరావతి రాజధాని పరిధిలో అవుటర్, ఇన్నర్ రింగ్‌రోడ్లు వస్తున్నాయని, ఇప్పటికే తూర్పు బైపాస్‌కు కేంద్రం అమోదం తెలిపిందని పశ్చిమ బైపాస్ నిర్మాణంలో ఉందని తెలిపారు. విజయవాడ పరిసర ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, మధ్య తరగతి ప్రజలకు ఇళ్ల స్థలాలు అందుబాటు ధరల్లో ఇవ్వాలనేదే మా కోరికఅన్నారు.



మాట్లాడుతున్న రైజ్ ఎన్ రైజ్ చైర్మన్ ఉప్పలపాటి ఉదయభాస్కర్‌రాజు

కొత్తూరు తాడేపల్లి వద్ద నూతన వెంచర్ ప్రారంభించినట్టు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ ఎంవీ నాగరాజు వెంచర్ ప్రత్యేకతలను వివరించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మార్కెటింగ్‌లో ప్రతిభ కనబరచిన డైరక్టర్లు, ఏజెంట్లకు చైర్మన్ ప్రోత్సాహకాలు అందజేశారు. సంస్థ డైరక్టర్లు ఎన్.సన్యాసిరావు, ఎ.పెద్దిరాజు, వీసీ కుమార్, ఎంవీవీ. కృష్ణారావు, టి.రాజు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మైండ్, మనీ గేమ్

(5వ పేజీ తరువాయి)

రైతులు, ప్రజలను ఇబ్బందులు పెడుతోంది. పోలీస్‌శాఖను అడ్డుపెట్టుకుని రైతులపై దౌర్జన్యం చేస్తోంది. కొత్తపేట పోలీస్ స్టేషన్ సీఐ కొండలరావు పూర్తిగా మేఘా సంస్థకు వకల్తా పుచ్చుకుని రైతులపై విరుచుకుపడుతున్నారు. సిబ్బందిని పెట్టించి మరీ దగ్గరుండి పనులు చేయిస్తున్నారు. కోర్టు స్టే ఇచ్చినా లెక్కలేనట్టుగా పనులు చేయించడం గమనార్హం. ఒక ప్రైవేటు సంస్థ కోసం సీఐ పడుతున్న ఆరాటంపై రైతులు తీవ్రంగా దుయ్యబడుతున్నారు. ఆందోళనకు వచ్చిన ప్రతిసారి తమపై దాడీ చేస్తూ, బలవంతంగా పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

మేఘా పనులపై అనుమానాలు!?

అర్ధచంద్రాకారపు హైటెన్షన్ టవర్ల అలైన్‌మెంట్‌కు ఏపీ ట్రాన్స్‌కో నుంచి అధికారిక అనుమతులు ఉన్నాయా లేదా అన్నది కూడా అనుమానమే. ల్యాంకో లైన్స్‌కు ముందు ట్రాన్స్ కో హైటెన్షన్ లైన్స్, పవర్ గ్రిడ్ లైన్స్ (పీజీఎల్) లకు సంబంధించి పనులు చేపట్టారు. వాటి అలైన్‌మెంట్ల కాపీలపై ట్రాన్స్‌కో అధికారుల అధీకృత సంతకాలు ఉన్నాయి. ల్యాంకో అలైన్‌మెంట్‌పై ట్రాన్స్‌కో ఉన్నతాధికారుల సంతకాలు లేకపోవడం కూడా ఈ అనుమానాలకు బలం చేకూరుస్తుంది. మరి ఈ పనిని ఎందుకు పిలిచారు? కమీషన్ల కోసం ఎన్‌హెచ్ అధికారులు పిలిచారా ? కాంట్రాక్టు సంస్థ మేఘాకు ప్రయోజనం కల్పించటానికి కట్టబెట్టారా? అన్నది తేలాల్సి ఉంది.

వినియోగంలోలేని విద్యుత్ లైన్ల మార్పు?

ల్యాంకో పవర్ ప్రాజెక్టు మూత పడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి చేయడం లేదు. భవిష్యత్తులో దీని పరిస్థితి ఏమిటో తెలియదు. ల్యాంకో కొండపల్లి పవర్ ప్లాంట్ తరఫున 400 కేవీ ట్రాన్స్‌మిషన్ టవర్స్ రీ లోకేషన్‌కు సంబంధించి రూ.32.58 కోట్ల వ్యయం అవుతుందని ప్రతిపాదించింది. సూపర్ వైజేషన్ చార్జీల కోసం ల్యాంకో సంస్థ, ఎన్‌హెచ్‌కు రూ.44.56 లక్షలు చెల్లించేందుకు సుముఖంగా ఉన్నట్టుగా ఎన్‌హెచ్ఏఐకు రాసినట్టుగా ఉన్న లేఖలో ఉంది. ఈ లేఖ అధీకృతమా ? కాదా ? అన్నది తేలాల్సి ఉంది. అలాగే ఈ లేఖతో పాటు జతపరిచిన అర్ధచంద్రాకారపు అలైన్‌మెంట్ కూడా ఏపీ ట్రాన్స్‌కో నుంచి అధీకృతంగా అనుమతులు వచ్చాయా అన్నది కూడా అనుమానమే. ఈ పనులను కేవలం ఎన్‌హెచ్ఏఐ ఆర్‌వో కార్యాలయం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేపడుతున్నట్టుగా తెలుస్తోంది. రైతులతో సంబంధం లేకుండానే పనులు చేసుకోమని ఎన్‌హెచ్ ఆర్‌వో అనుమతులిచ్చారని మేఘా సిబ్బంది రైతులతో ఘర్షణ పడిన సందర్భంలో వ్యాఖ్యానించినట్టుగా రైతులు చెబుతున్నారు. దీనిని బట్టి చూస్తే ఈ వ్యవహారంలో ఏదో కిరికిరి నడుస్తోందన్న విమర్శలు వస్తున్నాయి.

రైతులు తెచ్చిన అలైన్‌మెంట్

వంద మంది నష్టపోయే చోట పది మంది నష్టపోయినా పర్వాలేదనుకుని తమ భూములు సంతర్పణ చేయటానికి సిద్ధపడ్డ స్థానిక రైతులు వారే ఒక అధీకృత ఇంజనీర్ ద్వారా అలైన్‌మెంట్ ప్లాన్ గీయించారు. ఈ ప్లాన్ ప్రకారం కేవలం రెండు చోట్ల మాత్రమే నాలుగు టవర్లను మార్చటం ద్వారా మొత్తం సమస్య పరిష్కారమవుతుంది. ఈ రెండు చోట్ల భూములను ఇస్తామని ఇద్దరు రైతులు ముందుకు వచ్చారు. ఈ అలైన్‌మెంట్ వల్ల భారీ సంఖ్యలో రైతులు, 40 మందికి పైగా ప్లాట్లదారులకు నష్టం జరగదు. కేవలం ఇద్దరు రైతుల నష్టంతోనే సమస్య పరిష్కారమవుతుంది. రైతులు తెచ్చిన ఈ ప్రతిపాదన ఇటు ఎన్‌హెచ్ అధికారులు, అటు జిల్లా యంత్రాంగం చెవికెక్కడం లేదు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

కలెక్టర్ ఆదేశాలను సైతం మేఘా సంస్థ, కొత్తపేట పోలీసులు బేఖాతర్ చేస్తున్నారు. ఈ వివాదానికి చెక్ పెట్టేందుకు ట్రాన్స్‌కో అధికారులతో కమిటీ వేసి, నివేదిక ఇచ్చిన తర్వాతనే చర్యలు చేపట్టాల్సిందిగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా ఆదేశించారు. ఆయన ఆదేశాలను క్షేత్ర స్థాయిలో ఏమాత్రం పట్టించుకోకుండా పనులు చేస్తున్నారు.

కోర్టును ఆశ్రయించిన రైతులు.. స్టే ఇచ్చిన న్యాయస్థానం

రైతులు ఆందోళనతో దీనిపై కోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు స్టే కూడా ఇచ్చింది. మరి కొన్ని కేసులు విచారణలో ఉన్నాయి. హైకోర్టు స్టే ఇచ్చినా కూడా మేఘా సంస్థ పనులను ఆపలేదు. బలవంతంగా పనులు చేస్తోంది. కొత్త పేట పోలీసులను అడ్డుపెట్టుకుని పనులు చేస్తోంది.

ఎన్టీఆర్ 2, కృష్ణా 3

» రాష్ట్ర స్థూల విలువ జోడింపులో ర్యాంకుల పంట

» సేవా రంగంలో రాష్ట్రంలోనే ఎన్టీఆర్‌కు 2, కృష్ణాకు 5

» పారిశ్రామిక రంగంలో ఎన్టీఆర్‌కు 5, కృష్ణాకు 16

» వ్యవసాయానుబంధంలో ఎన్టీఆర్‌కు-23, కృష్ణాకు-2

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాష్ట్రానికి స్థూల ఆదాయాన్ని జోడించే జిల్లాల్లో ఎన్టీఆర్ జిల్లా 2వ స్థానంలో నిలవగా.. కృష్ణా జిల్లా మూడో స్థానం కైవసం చేసుకుంది. విశాఖపట్నం జిల్లా నంబర్ వన్ స్థానంలో నిలిచింది. రాష్ట్ర ఆర్థిక వృద్ధికి వ్యవసాయానుబంధ రంగాలు, పారిశ్రామిక, సేవా రంగాలు కీలకం. ఈ రంగాల్లో సాధించిన వృద్ధి ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వ జీడీపీ ఆధారపడి ఉంటుంది. రాష్ట్ర జీడీపీలో జిల్లాలు కీలకంగా ఉంటాయి. రాష్ట్ర జీడీపీకి ఏ జిల్లా ఎంత దోహదపడుతుందన్నదానిపై బుధవారం జరిగే కలెక్టర్ల కాన్ఫరెన్స్ సందర్భంగా ప్రభుత్వం ర్యాంకులను ప్రకటించింది. ఈ ర్యాంకుల్లో ఎన్టీఆర్ జిల్లా రెండో స్థానాన్ని, కృష్ణాజిల్లా మూడో స్థానాన్ని సాధించటం విశేషం. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాలు ఉంటే ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు రాష్ట్ర ఆదాయంలో టాప్-3లో చోటు దక్కించుకున్నాయి. వ్యవసాయానుబంధ రంగాల్లో ఎన్టీఆర్ జిల్లా రూ.9476 కోట్ల స్థూల విలువను జోడించింది. ఈ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ఆదాయంలో 2.21 శాతం మేర ఎన్టీఆర్ జిల్లా కాంట్రిబ్యూషన్ ఇచ్చింది. వ్యవసాయానుబంధ రంగం ఒక్కదాంట్లో ఎన్టీఆర్ జిల్లాలో రాష్ట్రంలో 23వ స్థానంలో నిలిచింది. కానీ పారిశ్రామిక, సేవా రంగాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించటం ద్వారా రాష్ట్రంలోనే రెండవ ర్యాంకును సొంతం చేసుకుంది. పారిశ్రామిక రంగంలో రూ.14,228 కోట్ల ఆదాయాన్ని సాధించింది. తద్వారా ఈ రంగంలో రాష్ట్ర ఆదాయానికి ఎన్టీఆర్ జిల్లా 4.52 శాతం స్థూల విలువను జోడించింది. పారిశ్రామికరంగ పురోభివృద్ధిలో ఎన్టీఆర్ జిల్లా రాష్ట్రంలోనే 5వ స్థానంలో నిలిచింది. ఇక సేవా రంగం విషయానికి వస్తే రూ. 45.419 కోట్ల ఆదాయాన్ని సాధించింది. రాష్ట్రం ఈ రంగంలో సాధించిన విలువలో 9.45 శాతం మేర ఎన్టీఆర్‌జిల్లా స్థూల విలువను జోడించింది. సేవా రంగంలో ఎన్టీఆర్ జిల్లా రాష్ట్రంలోనే 2వ స్థానంలో నిలిచింది. ఈ మూడు రంగాలలో చూస్తే రూ.69,123 కోట్ల ఆదాయంతో రాష్ట్ర ప్రభుత్వానికి 5.65 శాతం మేర స్థూల విలువను జోడించి రాష్ట్రంలోనే రెండవ స్థానంలో నిలిచింది. ఇక కృష్ణాజిల్లా విషయానికి వస్తే .. వ్యవసాయానుబంధ రంగాలలో రూ. 32,372 కోట్ల వ్యయంతో 7.56 శాతం స్థూల విలువను జోడించింది. తద్వారా రాష్ట్రంలోనే రెండవ స్థానాన్ని సాధించింది. పారిశ్రామిక రంగంలో రూ.7632 కోట్ల ఆదాయంతో 2.42 శాతం స్థూల విలువను జోడించింది. తద్వారా రాష్ట్రంలోనే 16వ స్థానాన్ని సాధించింది. సేవా రంగంలో రూ. 24,115 కోట్ల ఆదాయంతో 5.01 శాతం స్థూల విలువను జోడించింది. తద్వారా రాష్ట్రంలోనే 5వ స్థానంలో నిలిచింది. ఈ మూడింటిలోనూ రూ. 64,118 కోట్ల ఆదాయం సాధించటం ద్వారా రాష్ట్ర ఆదాయానికి 5.24 శాతం మేర స్థూల విలువను జోడించి రాష్ట్రంలోనే 3 వ స్థానంలో నిలిచింది.

జీఎస్‌డీపీలోనూ ఎన్టీఆర్, కృష్ణా 2, 3 స్థానాలు కైవసం

రాష్ట్ర జీడీపీకి కీలకంగా మారిన ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలో గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ (జీఎస్‌డీపీ)లో కూడా అదే ఊపును ప్రదర్శించాయి. వరుసగా 2, 3 స్థానాలలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు నిలిచాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఎన్టీఆర్ జిల్లా రూ. 73,632 కోట్ల ఆదాయంతో జీఎస్‌డీపీని సాధించింది. 2028 - 29 నాటికి రూ. 1,63,738 కోట్లకు పెరగవచ్చు అని అంచనా. కృష్ణాజిల్లా విషయానికి వస్తే 2022- 23 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 68,301 కోట్ల ఆదాయంతో జీఎస్‌డీపీని సాధించటం జరిగింది. అలాగే 2028 - 29 నాటికి రూ.1,69,469 కోట్లు పెరిగే అవకాశం ఉందన్నది అంచనాగా ఉంది.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యాత్రికుల రద్దీని పురస్కరించుకుని శబరిమలకు వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.



07173 కాకినాడ పోర్టు-కొల్లం బుధవారం రాత్రి 11.50కి బయలుదేరుతుంది. శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు కొల్లం చేరుతుంది. ఈనెల 11, 18, 25 తేదీల్లో ఈరైలు నడుస్తుంది. 07174 కొల్లం-కాకినాడ పోర్టు శుక్రవారం ఉదయం 8.40కి బయలుదేరుతుంది. శనివారం సాయంత్రం 4గంటలకు కాకినాడ పోర్టుకు చేరుతుంది. ఈనెల 13, 20, 27 తేదీల్లో నడుస్తుంది. 07175 సికింద్రాబాద్-కొల్లం గురువారం రాత్రి 8 గంటలకు బయలుదేరుతుంది. శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు కొల్లం చేరుతుంది. ఈనెల 19, 26 తేదీల్లో ఈ రైలు నడుస్తుంది. 07176 కొల్లం-సికింద్రాబాద్ రైలు శనివారం ఉదయం 5 గంటలకు బయలుదేరుతుంది. ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈనెల 21, 28 తేదీల్లో ఈ రైలు నడుస్తుంది. కాకినాడ పోర్టు-కొల్లం ప్రత్యేక రైలు ఆరు సర్వీసులు నడుస్తుంది. కాకినాడ టౌన్, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడురు, రేణిగుంట, తిరుపతి, చిత్తూరు, కాట్పాడి, జోలార్‌పేట, సేలం, ఈరోడ్డు, తిరుపూర్, పొలనూరు, పాలక్కాడ్, త్రిశూర్, అరువ, యర్నాకులం, ఎట్టుమనువర్, కొట్టాయం, తిరువల్లా, చెంగనూరు, కాయంకుళం స్టేషన్లలో ఆగుతాయి. సికింద్రాబాద్-కొల్లం ప్రత్యేక రైలు నాలుగు సర్వీసులు నడుస్తుంది. ఈ రైళ్లు మౌలాలి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, వెల్లూరు, తిరువణ్ణామలై, విల్లిపురం, వృద్ధాచలం, అరియలూరు, శ్రీరంగం, తిరుచురాపల్లి, దిండిగల్, మధురై, విరుధ్ధనగర్, టెంకాశి, చెంగొట్టై, పునలూరు స్టేషన్లలో ఆగుతుంది. కాగా, 07151 కాచిగూడ - కొట్టాయం శబరిమల ప్రత్యేక రైలు జనవరి 2, 9, 16, 23 తేదీల్లో కోయంబత్తూరు స్టేషన్‌లో ఆగదని తెలిపారు. ఇదే మాదిరి 07133 కాచిగూడ - కొట్టాయం రైలు కూడా ఈనెల 12, 19, 26 తేదీల్లో ఆగదని తెలిపారు.

పలు రైళ్ల మళ్లింపు..


12863 హౌరా-బెంగళూరు ఈనెల 11, 13, 14, 16, 17, 20, 21, 23, 24 తేదీలలో అలాగే 13351 ధన్‌బాద్-అలప్పూజ ఈనెల 10, 16, 17, 20, 21, 23, 24తేదీలలో 22837 హాథియా-ఎర్నాకులం ఈనెల 16, 23 తేదీల్లో, 12835 ఈనెల 10, 17, 24 తేదీల్లో, 12889 టాటానగర్ - బెంగళూరు ఈనెల 20వ తేదీన, 18637 హాథియా - బెంగళూరు ఈనెల 21వ తేదీన నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా దారిమళ్లిస్తారు. కాగా, 12863 రైలు తాడేపల్లిగూడెం, ఏలూరులలో, 22837 రైలు ఏలూరు స్టేషన్లలో ఆగవు. 11019 ముంబయి-భువనేశ్వర్ రైలు ఈనెల 11, 13, 14, 25, 27, 28, 30తేదీల్లో 17239 గుంటూరు - విశాఖపట్నం ఈనెల 26, 28, 29, 30తేదీల్లో విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా దారి మళ్లిస్తారు. 11019 రైలు ఏలూరు, తాడేపల్లిగూడెంలలో ఆగదు. 17239 నూజివీడు, పవర్‌పేట, ఏలూరు, భీమడోలు, తాడేపల్లిగూడెం మీదుగా దారి మళ్లిస్తారు.

ప్రత్యేక రైళ్ల కాల పరిమితి పొడిగింపు..

06081 కొచ్చివెలి-షాలిమార్ శుక్రవారం నడుస్తుంది. ఈనెల 20 నుంచి జనవరి 24వ తేదీ వరకు, 06082 షాలిమార్-కొచ్చివెలి సోమవారం నడుస్తుంది. ఈనెల 23 నుంచి జనవరి 27వ తేదీ వరకు, 06087 తిరునల్వేలి-షాలిమార్ గురువారం నడుస్తుంది. ఈనెల 19 నుంచి జనవరి 23వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో శనివారం నడిచే అదే రైలును ఈనెల 21 నుంచి జనవరి 25 వరకు పొడిగించారు. 06095 తాంబరం- సంత్రాగచి గురువారం నడుస్తుంది. ఈనెల 19 నుంచి జనవరి 23వ తేదీ వరకు తిరుగు ప్రయాణంలో అదే రైలు శుక్రవారం నడుస్తుంది. ఈనెల 20 నుంచి జనవరి 24వ తేదీ వరకు, 06055 పొడనూరు-బరోని శనివారం నడుస్తుంది. ఈనెల 21 నుంచి జనవరి 25వ తేదీ వరకు, 06056 బరోని - పొడనూరు మంగళవారం నడుస్తుంది. ఈనెల 24 నుంచి జనవరి 28వ తేదీ వరకు పొడిగించారు.

మార్కెట్ యార్డు కమిటీలపై కూటమి నేతల చూపు!

» రూల్ ఆఫ్ రిజర్వేషన్ ద్వారా చైర్మన్ల నియామకాలు



(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం టౌన్) : ముడా చైర్మన్ పదవి బీజేపీ నేతకు కేటాయించడంతో జిల్లాలోని 12 వ్యవసాయ మార్కెట్‌యార్డు పదవులపై కూటమి నేతలు ఆశలు పెట్టుకున్నారు. మూడు విడతల్లో నామినేటెడ్ పోస్టుల జాబితాలు వెల్లడించగా.. వ్యవసాయ మార్కెట్ యార్డు పదవులను ఇంకా భర్తీ చేయలేదు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్‌లు నామినేటెడ్ పోస్టుల కోసం ఎదురు చూస్తున్నారు.జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 12 మార్కెట్ కమిటీల చైర్మన్ పదవుల కోసం ఇప్పటికే కొందరు నాయకులు ఎమ్మెల్యేల సిఫార్సుల లేఖలతో మంత్రి అచ్చెన్నాయుడు వద్దకు వెళ్లారు. సిఫార్సు లేఖలపై మంత్రి ఎవరికీ మాట ఇవ్వలేదు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్‌లో ఎవరికి దక్కుతుందో?

ఎవరికి వారు మార్కెట్ యార్డుల పదవులు తమనే వరిస్తాయని చెప్పుకుంటున్నారు. అయితే కృష్ణాజిల్లాను యూనిట్‌గా చేసుకుని రూల్ ఆఫ్ రిజర్వేషన్‌తో మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ పదవులు భర్తీచేయాలని ప్రభుత్వం నుంచి కలెక్టర్‌కు ఆదేశాలు అందాయి. జీవో 77 ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలు, ఓసీలకు జిల్లాలోని 12 మార్కెట్ యార్డు పదవులను ఎమ్మెల్యేల సమక్షంలో లాటరీ పద్ధతిపై కేటాయించాల్సి ఉంది.

● మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో మార్కెట్ యార్డు ఒక్కటే ఉంది. పెడన నియోజకవర్గంలో పెడన, బంటుమిల్లి రెండు ఉన్నాయి. గుడివాడ నియోజకవర్గంలో గుడివాడ, గుడ్లవల్లేరు, ఉయ్యూరు నియోజకవర్గంలో ఉయ్యూరు, కంకిపాడు, పామర్రు నియోజకవర్గంలో పామర్రు, మొవ్వ (కూచిపూడి), అవనిగడ్డ నియోజకవర్గంలో నాగాయలంక, కొడాలి, గన్నవరం నియోజకవర్గంలో గన్నవరం మార్కెట్ యార్డుల నుంచి కూటమి నాయకులు దాదాపు 32 మంది పదవులను ఆశిస్తున్నారు. లాటరీ పద్ధతిలో ఈ 12 వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఏ సామాజిక వర్గానికి రిజర్వు అవుతాయో తేలిపోతాయి. వైసీపీ పాలనలో కలెక్టర్లకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ మౌఖికంగా చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వంలో మార్కెట్ యార్డు చైర్మన్ల నియామక బాధ్యతలను కలెక్టర్లకు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. చైర్మన్‌తో పాటు డైరెక్టర్ల పదవులు రిజర్వేషన్లతో భర్తీ చేస్తారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	102, 110, 121
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.630

ఆంజనేయస్వామి పాద ముద్రకు పూజలు

గన్నవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గొల్లనపల్లి శివారు, చిక్కవరం గ్రామానికి ఉత్తర దిక్కున కొండ మీద ఆంజనేయ స్వామి పాదాలు కనిపించాయి. రమణీయమైన ప్రకృతి మధ్య ఔషధ గుణాలు కలిగిన వృక్షాల సమూహాల మధ్య పాదాలను హనుమాన్ దీక్షలో ఉన్న గొర్రెల కాపరులు గమనించి సమీపంలోని క్షేత్ర హనుమత్‌పురం ఆలయం నిర్వాహకులకు తెలిపారు. వాళ్లు దర్శించి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఎంతో విశిష్టత కలిగిన ఈ పాదముద్ర కాలానుగుణంగా మరుగున పడి నేడు వ్యక్తమైనట్టు చిట్టినేని వంశీ కృష్ణ తెలిపారు. భక్తి పరవశంతో భక్తులు పూజలు చేసినట్టు తెలిపారు.



నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

గన్నవరం: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈ వెంకట రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పురుషోత్తపట్నం, కొండపావులూరు, గోపవరపుగూడెం, కట్టుబడిపాలెం, ముదిరాజు పాలెం ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఛలో గుంటూరు పోస్టర్ ఆవిష్కరణ

కంకిపాడు :ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని బహుజన సమాజ్ పార్టీ సీనియర్ నాయకులు గుడె జయప్రకాష్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఛలో గుంటూరు పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కంకిపాడు జేఏసీ కో ఆర్డినేటర్ బట్టు నాగరాజు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందచేస్తున్న సత్యనారాయణ

ఆర్థిక సాయం

ఉయ్యూరు : ముదునూరుకు చెందిన ఎం. రాజ్యలక్ష్మికి వైద్యఖర్చుల నిమిత్తం రూ. 10వేల ఆర్థిక సాయం టీడీపీ నాయకుడు, పీఏసీఎస్ మాజీ ఛైర్‌పర్సన్ పాలడుగు సత్యనారాయణ అందజేశారు. బీఫార్మసీ చదువుతున్న రాజ్యలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకునే స్తోమతలేక ఇబ్బంది పడుతోంది. విషయం తెలుసుకున్న సత్యనారాయణ ఆమెకుటుంబ సభ్యులను కలుసుకుని వైద్యఖర్చులకు ఆర్థిక సాయం అందచేశారు. మాజీ సర్పంచ్ ఎం. జ్ఞానశేఖర్, శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు జితేంద్ర, సుబ్రమణ్యం, ఎస్సీ నాయకుడు కె.వెంకటేశ్వరరావు, అజయ్ కుటుంబ సభ్యులను కలసి పరామర్శించారు.


రికార్డులు తనిఖీ చేస్తున్న గీతాబాయి

హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల పరిశీలన

ఉయ్యూరు :కడవకొల్లు, కాటూరు-2 హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను జిల్లా వైద్యఅధికారి జి. గీతాబాయి మంగళవారం పరిశీలించారు. పాఠశాలల్లో ఆరోగ్యకార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వైద్యపరీక్షలపై ఆరాతీశారు. అనంతరం హెల్త్ వెల్‌నెస్ సెంటర్ తనిఖీచేసి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధిచి సర్వేలు ఎలా జరుగుతున్నా యో సిబ్బందిని విచారించారు. పీహెచ్‌సీలో రికార్డులు, సిబ్బంది హాజరుపట్టీలు తనిఖీ చేశారు. ఆర్‌బీఎస్‌కె ప్రోగ్రామ్ ఆఫీసర్ హిమబిందు, కిరణ్, పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.శివ రామకృష్ణారావు, హిమబిందు, నాగార్జున బాబూరావు పాల్గొన్నారు.


నిత్యావసరాలను అందిస్తున్న మానవతసభ్యులు

నిత్యావసరాలు అందజేత

హనుమాన్‌జంక్షన్: స్థానిక ఆదిత్య బధిర, ఆశాజ్యోతి మానసిక దివ్యాంగుల పాఠశాలలకు మానవత సభ్యులు మంగళవారం రూ.10వేలు విలువ చేసే నిత్యావసరాలను అందజేశారు. స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో ఆ పాఠశాలల నిర్వాహకులు ఆకుల వెంకటరమణ, మరీదు వెంకటస్వామిలకు అందించారు. మానవత జంక్షన్ శాఖ అధ్యక్షుడు గూడపాటి జయరామచంద్రరావు జన్మదినం సందర్భంగా ఆయన కుమారులు, నాగార్జున, పవన్‌కుమార్, వంశీకృష్ణ నిత్యావసరాలను అందించారు. కార్యక్రమంలో మానవత సభ్యులు వేగిరెడ్డి సూర్యనారాయణ, వడ్డి రాజేశ్వరరావు, పభాకర్‌రావు, రామచంద్రరావు,ఇందిరాదేవి, సుబ్బారావు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి అభిషేకాలు

హనుమాన్‌జంక్షన్: స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అభయాంజనేయ స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో స్వామి దర్శనం కోసం ఉదయం 5గంటల నుండి భక్తులు క్యూ కట్టారు .ఆలయ ఈవో కె.శ్రీనివాస్ పర్యవేక్షణలో అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు, శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు పూజా కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు. మాదల బాబురావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కాకాని సత్యవాణి 400 మందికి అన్నప్రసాద వితరణ చేశారు.

ధాన్యం కొనుగోలులో పకడ్బందీగా వ్యవహరించాలి

● రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో రైతులు ఇబ్బంది పడకుండా చేస్తూ తేమశాతంలో సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా వ్యవహరించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్. ఢిల్లీరావు ఐఏఎస్ సూచించారు. ఎస్.ఎన్.పాలెంలోని రైతు సేవా కేంద్రాన్ని, రంగయ్యప్పారావుపేట రోడ్డులోని రైస్ మిల్లులను సోమవారం ఆయన అకస్మిక తనిఖీ నిర్వహించారు.సంచుల కొరత రాన్వికుండా ఆన్‌లైన్ ద్వారా సరి చూసుకుంటూ రిజస్ర్‌లో నమోదు చేసుకోవాలని, ధాన్యం లోడింగ్, వాహనాల జీపీఎస్ విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. రంగయ్యప్పారావుపేట రోడ్డులోని రైస్ మిల్లులో ధాన్యం డ్రైయర్ పనితీరు, తేమశాతం కొలిచే యంత్రాల పనితీరు తదితర విషయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లపై ఏడీఈ సునీల్, ఏఓ భవానిలతో కలిసి సమీక్షించి, ధాన్యం కొనుగోలులో ఎటువంటి సమస్య తల్తెకుండా చూడాలని సూచించారు. బాపులపాడు మండల వ్యాప్తంగా వరిపంట సాగు వివరాలు, ధాన్యం కొనుగోలు వివరాలను, పౌరసరఫరాల శాఖ ద్వారా అందజేసిన గోనుసంచుల వివరాలను ఏఓ భవానిని అడిగి తెలుసుకున్నారు. ఎస్.ఎన్.పాలెం సర్పంచ్ అడపా అంజిబాబు, రైస్ మిల్లు యజమానులుశ్రీనివాసరావు, పొట్లూరి రాము, వీఏఏ పూర్ణచంద్రరావు, పాల్గొన్నారు.


తేమశాతం యాంత్రాన్ని తనిఖీచేస్తున్న ఎస్. ఢిల్లీరావు

రోగులకు సీఎం సహాయనిధి వరం : యార్లగడ్డ

గన్నవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోగులకు సీఎం సహాయనిధి వరం లాంటిదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం 12 మందికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. మాలావతుల అమ్ములుకు రూ.15వేలు, వీరంకి రంగమ్మకు రూ.62వేలు, ఆనంద్‌కుమార్‌కు రూ.2.75లక్షలు, కుమార్‌కు రూ.1.37లక్షలు, సీతామహాలక్ష్మికి రూ.30వేలు కరిముల్లాకు రూ.2.83 లక్షలు అబ్దుల్ రహీమ్‌నకు రూ.1.29లక్షలు, వెంకటరమణకు రూ.69వేలు, బి.రాంబాబుకు రూ.63వేలు, దేవరబాబుకు రూ.1.48లక్షలు, శ్రీనివాసరావుకు రూ.2.40లక్షలు, యామినికి రూ.35వేలు చెక్కులను, భూషణానికి రూ.1.25లక్షల ఎల్‌వోసీని అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న టౌన్ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, యనమదల సతీష్, జాస్తి మురళీకృష్ణ, జొన్నలగడ్డ సుధాకర్ పాల్గొన్నారు.

పెనమలూరు : ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన సుమారు ఎనిమిది లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులు స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చేతుల మీదుగా అందుకున్నారు. మంగళవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న బోడె ప్రసాద్

ప్రజా ఆస్తుల పరిరక్షణకే రెవెన్యూ సదస్సులు

ఉంగుటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలకులు చేసిన భూదందాలు, రీసర్వేలు, భూరికార్డుల్లో అవకతవకలతో రక్షణ కరవైన ప్రజా ఆస్తులను పరిరక్షించేందుకే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గ్రామగ్రామాన రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని మానికొండ గ్రామంలో ఆర్ఐ బి.సూర్యకాంతి ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ జాలాది విమలకుమారి మాట్లాడుతూ గ్రామగ్రామాన నిర్వహిస్తోన్న రెవెన్యూ సదస్సులకు విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలకు అవసరమైన ధ్రువీకరణపత్రాలు మంజూరుచేస్తామన్నారు. ఈకార్యక్రమంలో మండల ఎండోమెంట్ ఆఫీసర్ ఈవీ ప్రసాదరావు, డీఐవోఎస్ నరసింహమూర్తి, వీఆర్వోలు, సీహెచ్ తాతయ్య, వి.వెంకటరాము, పంచాయతీకార్యదర్శి సి.ప్రకాష్, టీడీపీ నాయకులు ఆరికట్ల రవికుమార్, రాజ్‌కుమార్, షేక్ దాదా, ప్రకాష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ విమలకుమారి

ఉయ్యూరు :బజర్లపూడిలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతులనుండి 8 అర్జీలు స్వీక రించారు. భూమి సర్వే కోసం 7, పట్టాదారు పాస్‌పుస్తకం కొరకు ఒక అర్జీ వచ్చినట్టు డిప్యూటీ త హసీ ల్దార్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆర్ఐ యతేంద్రియులు, సర్వేయర్ సురేశ్, గ్రామ సర్పంచ్ సూరపనేని శేష వరప్రసాద్, పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

గన్నవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏసు క్రీస్తు బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమని రెవరెండ్ జాన్ విక్రమ్ అన్నారు. బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక ఎఫ్ఎఫ్‌సీ ప్రేయర్ హాల్లో మంగళవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్ విక్రమ్ ప్రసంగిస్తూ క్రిస్మస్‌కు ముందు నిర్వహించేదే సెమీ క్రిస్మస్ అని దాని విశిష్టతను వివరించారు. మన కొరకు లోక రక్షకుడు పుట్టిన రోజే క్రిస్మస్‌ను నిర్వహించుకుంటామని తెలిపారు. ప్రతీ ఒక్కరూ క్రీస్తు మార్గంలో నడిచి ఇతరుల పట్ల ప్రేమ దయ, కరుణ, జాలి చూపాలన్నారు. క్యాండిల్స్ ప్రదర్శన చేసి కేకును కట్ చేశారు. బైబిల్ సొసైటీ గన్నవరం బ్రాంచ్ అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజ్ అధ్యక్షతన నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ప్రేమ్ దర్శన్, కొడాలి జోయల్, జీవ మనోహర్, దేవ సహాయం, ప్రభోద్, బాబూరావు, సురేష్‌బాబు, విక్టర్ బాబు, మోసెస్ తదితరులు పాల్గొన్నారు.


క్యాండిల్స్ ప్రదర్శన చేస్తున్న బైబిల్ సొసైటీ సభ్యులు

408 మద్యం సీసాలు స్వాధీనం .. ముగ్గురు అరెస్ట్

ఉయ్యూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కంకిపాడు సమీపంలో సోమవారం సాయంత్రం కారులో మద్యం తరలిస్తున్న ఇద్దరి వద్దనుండి 408 మద్యం సీసాలు స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనపరచుకుని అరె స్టుచేసినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉయ్యూరు సీఐ శేషగి రిరావు తెలిపారు. కారు లో మద్యం సీసాలు ఉన్నట్టు సమాచా రం మేరకు తనిఖీ చేశారు. 180 ఎంఎల్ 384 ఐ ఎంసీ సీసాలు, 650ఎంఎల్ 24బీరు సీసాలు పట్టుబడ్డాయన్నారు. కారులో ఉన్న కాకి విద్యాసాగర్, కుంభం సురేశ్‌ను అరెస్టుచేసి విచారించారు. దీంతో మరోవ్యక్తి జంగాల శ్రీనివాస్‌కూ సంబంధం ఉన్నట్టు చెప్పడంతో ఆయనతో కలిపి ముగ్గురిని అరెస్టుచేసి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

శ్రీచైతన్య విద్యాసంస్థల ఫ్రెషర్స్, ఫేర్‌వెల్ డే


సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

పెనమలూరు, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రోడ్డులోని శ్రీచైతన్య విద్యాసంస్థల రవీంద్రనాథ్ ఠాగూర్ భవన్ విద్యార్థినీ, విద్యార్థుల ఫ్రెషర్స్, ఫేర్వెల్ డే కార్యక్రమాలు కానూరు మన కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డీన్ గుంటూరు హరిబాబు మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్య, మానసిక అభివృద్ధికి ఇటువంటి సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. డీన్ బీ శ్రీనివాసరావు జ్యోతి వెలిగించి మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యాసంస్థల్లో చదువుతో పాటుగా విద్యార్థుల మానసికోల్లాసానికి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎంలు కొమ్మినేని రంగారావు, దావులూరి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్స్ గోకర్ణేశ్వరరావు, షేక మీరావలి తదితరులు పాల్గొన్నారు.


ప్రదర్శించిన ప్రాజెక్టును తిలకిస్తున్న విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఉయ్యూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన పాలిటెక్ ఫె స్ట్-2024లో శ్రీజ్యోతిపాలిటెక్నిక్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఫెస్ట్‌లో 129 ప్రదర్శనలు రాగా అందులో తమ కళాశాల మెకానికల్ విభాగం విద్యార్థు లు ప్రదర్శించిన వైర్‌లెస్ సోలార్ బేస్డ్‌మల్టి పర్పస్ అగ్రికల్చర్ రోబోట్ ప్రాజెక్ట్‌కు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయింది. కళాశాల సెక్రటరీ సూరపనేని వెంకటరమణ , ప్రిన్సిపాల్ జన్ను శివకుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించిన వి ద్యార్థులను ఈసందర్భంగా సెక్రటరీ, ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

గన్నవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) :ఎన్నికలలో వచ్చిన హామీల అమలుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నట్టు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చానని ఆ దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలిపారు. మంగళవారం రాత్రి మెగా జాబ్ మేళా పోస్టర్‌ను స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ఈ నెల 14న ఎనికేపాడు శక్తి కళ్యాణ మండలం రోడ్డులో ఉన్న టీడీపీ కార్యాలయంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 50పైగా కంపెనీలు, 5వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తున్నట్టు తెలిపారు. మూతబడిన అశోక్ లేల్యాండ్‌ను పునః ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఇండస్ట్రీయల్ పార్క్‌లో వేలమందికి ఉద్యోగాలు రానున్నాయన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న, మండల కార్యదర్శి బోడపాటి రవికుమార్, మాదల సాంబశివరావు, ఎంపీటీసీ సభ్యుడు పడమట రంగారావు, యనమదల సతీష్, జాస్తి మురళీకృష్ణ, రామినీడు బసవపూర్ణయ్య, జొన్నలగడ్డ సుధాకర్ పాల్గొన్నారు.


జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యార్లగడ్డ

సుస్థిర లక్ష్యాలపై శిక్షణ

ఉయ్యూరు :లోకలైజేషన్ ఆఫ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (17) సుస్థిర లక్ష్యాలపై మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల పరిధి గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి అధికారులు శిక్షణాకార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా ఎంపీ డీవో జీఎస్‌వీ శేషగిరిరావు మాట్లాడుతూ గ్రామాల్లో పేదరికాన్ని నిర్మూలించడమే శిక్షణ ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామాల్లో ఆరోగ్య సంరక్షణ జీవన ప్రమాణాలు పెరగాలని సీహెచ్‌సీ డాక్టర్ పి.మురళీ అన్నారు. ఏపీఎం అమరేశ్వరరావు, ఈవోపీఆర్డీ ఎఎస్ఆర్ కోటేశ్వరరావు, బాపట్ల ఈటీసీ సెంటర్ ప్రతినిధి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బ్రహ్మయ్యలింగం చెరువు అభివృద్ధికి కృషి

గన్నవరం: బ్రహ్మయ్యలింగేశ్వరస్వామి ఆలయం, చెరువు రెవెన్యూ పరిధిలో ఉన్నందున సంబంధిత శాఖతో చర్చించి పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ముందుకు వెళతామని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి మండలి ఛైర్మన్ బాలాజీ చెప్పారు. మండలంలోని చిక్కవరం బ్రహ్మయ్యలింగేశ్వరస్వామి ఆలయాన్ని మంగళవారం సందర్శించారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు.పర్యాటక పరంగా చెరువులో బోటింగ్, కొండపై హోటల్ వంటి ఏర్పాటు పై రెవెన్యూ శాఖతో సంప్రదించి డీపీఆర్ చేయిస్తామని అన్నారు. ఆయన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న, పర్యాటక శాఖ రీజనల్ మేనేజర్ చైతన్య, చిక్కవరం, తోటపల్లి సర్పంచ్‌లు అన్నే లక్ష్మణరావు, ఆరేపల్లి శ్రీనివాసరావు, పంచాయితీ కార్యదర్శి హర్షవర్ధినీ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవంతో జీవించేందుకు హక్కులు అవసరం

● హెచ్‌ఎం లూథర్‌పాల్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, 10(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆత్మగౌరవంతో జీవించేందుకు హక్కులు అవసరమని, ఉత్తమ భవిష్యత్తుకు మానవ హక్కులపై అవగాహన విద్యార్థులకు అవసరమని హెచ్‌ఎం లూథర్‌పాల్ అన్నారు. రేమల్లె, మల్లవల్లి హైస్కూల్‌లో మంగళవారం అంర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. మావన హక్కులపై అవగాహన లేకపోవడం వల్ల ప్రజల వాక్ స్వాతంత్రానికి, భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతవ కలుగుతున్నదన్నారు. ప్రజాస్వామ్య దేశమైన మన భారత దేశ ఉజ్వల భవిష్యత్తుకు విద్యార్థి దశనుండి మానవ హక్కులపై అవగాహన కలిగిఉండాలని సూచించారు రాజ్యాంగంలో పొందుపరచబడి, ప్రభుత్వాలు కల్పిస్తున్న హక్కులను కాపాడుకుండా బాధ్యతతో మెలగాల్సిన అవసరం యువతకు ఉందని దారపురెడ్డి భాస్కరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలమర్తి రవిబాబు, కె.వి.కుమారి, దివి పార్థసారధి, రాజశేఖర్, వెంకటేశ్వరరావు, తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హెచ్‌ఎం లూథర్‌పాల్

నాగబాబుకు అభినందనలు

కంకిపాడు :రాష్ట్ర మంత్రి వర్గంలోకి జనసేన పార్టీ సీనియర్ నాయకులు కొణిదెల నాగబాబుకు స్థానం కల్పించటం అభినందనీయమని టీడీపీ, జనసేన పార్టీల పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా అన్నారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో మంగళవారం నాగబాబును కలిసి ఆయన అభినందించారు. నాగబాబును మంత్రి వర్గంలో తీసుకోవడంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు చెప్పారు. స్థానిక జనసేన పార్టీ నాయకులు పచ్చిపాల శేఖర్, బోయిన నాగరాజు, జక్కా రఘు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కూటమి ధ్యేయం

గన్నవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద రైతులకు ఉచితంగా వీబీఎన్-8 రకం మినుముల నాలుగు కేజీల కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ కొత్త రకం మినుములు వచ్చాయని, మన ప్రాంతంలోని నేల దిగుబడికి ఎలా ఉంటుందోనని ప్రయోగాత్మకంగా చేస్తున్నట్టు తెలిపారు. వెయ్యి మంది రైతులకు నాలుగు కేజీల చొప్పున ఒక్కో కిట్ అందించనున్నామన్నారు. రైతుల ఫీడ్ బ్యాక్ తీసుకుని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు పంపుతారని తెలిపారు. దిగుబడి పెరిగి ఖర్చులు తగ్గుతుంటే వచ్చే ఏడాది నుంచి ఇవే మినుములు రైతులకు సబ్సిడీపై ఇస్తారని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం వ్యవసాయాన్ని దండగా చేస్తే కూటమి ప్రభుత్వం పండుగలా మార్చిందన్నారు. ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతుల వద్దకే అధికారులు వెళ్లి సలహాలు సూచనలు చేస్తూ పంటలను పరిశీలిస్తున్నారని తెలిపారు. ఏడీఏ సునీల్, ఎంఏవో రజని, రైతులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతి అదానీని అరెస్టు చేయాలి

గన్నవరం: అవినీతి అదానిని వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ ప్రాంతీయ కార్యదర్శి పెద్దు వాసుదేవారావు డిమాండ్ చేశారు. సీపీఐ పిలుపు మేరకు గన్నవరం తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ అదాని గ్రూప్ కంపెనీల అవినీతిపై జేపీసీ ఏర్పాటు చేయాలన్నారు.సీపీఐ నాయకులు రామచంద్ర జోషి, శనగల సుబ్బారెడ్డి, కట్టవరపు విజయరావు, మోహనరావు, వెంకటేశ్వరరావు, శివయ్య, బెనర్జీ, భవాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్టార్ తిరిగేనా?





క్రిస్మస్ వచ్చిందంటే చాలు క్రిస్మస్ ట్రీలకు, స్టార్లకు మంచి డిమాండ్ ఉంటుంది. నగరంలోని అన్ని చర్చిలపై చిన్న స్టార్ నుంచి పెద్ద స్టార్ వరకు ఏర్పాటు చేస్తుంటారు. అయితే వీటి తయారీనే జీవనాధారంగా చేసుకుని ఎంతోమంది ఎంతో కొంత ఉపాధి పొందుతున్నారు. ఒక్కో స్టార్ సైజును బట్టి రూ.200 నుంచి రూ.4వేల వరకు అమ్ముతారు. అయితే ఇలాంటి పండుగలొచ్చినప్పుడే వీరికి డిమాండ్, మిగతా రోజుల్లో నిల్. ఏ కూలికో నాలికో వెళ్లాల్సిందే. ఇటువంటి చేతి వృత్తుల వారికి ప్రభుత్వం ఉపాధి మార్గాలను అన్వేషించాలి. విజయవాడ నగరంలోని మొగల్రాజపురంలో ఉన్న మధు గార్డెన్ వద్ద ఈ స్టార్‌ల తయారీదారులున్నారు. ఫ్యాక్టరీలలో తయారు చేసే స్టార్ల కన్నా ఇవి నాణ్యంగా ఉంటాయి. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

పట్టభద్రుల ఓటర్ల జాబితాలో సవరణలకు అవకాశం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలు వెల్లడవుతున్నాయి. ఇటీవల పట్టభద్రుల ముసాయిదా జాబితాను నవంబరు 23న ప్రకటించారు. ఈ జాబితాలో 2,90,970 మంది ఓటర్లున్నట్టు ఎన్నికల అధికారి, గుంటూరు డీఆర్వో ఖాజావలి ప్రకటించారు. తాజాగా అభ్యంతరాలతో పాటు నూతన ఓటర్ల నమోదుకు పెంచిన గడువు సోమవారంతో ముగిసింది. 63,607 దరఖాస్తులందాయి. డూప్లికేట్లు 2300 ఉన్నట్టు ఫిర్యాదు లు అందాయి. ఫారం- 8లో వయసు, తండ్రి, ఓటరు పేరు, ఇంటి నెంబర్లలో తప్పులు దొర్లిన సవరణలు 13వేలున్నాయి. ఇలా 63,607 దరఖాస్తుల్లో 15,300 దరఖాస్తులు పోగా కొత్తగా రెండోసారి 48,307 మంది ఓటర్లు చేరారు. గతంలో ఓటర్ల ముసాయిదాలో 2,90,970 మంది ఓటర్లకు కలిపితే 3,39,275 మంది ఓటర్లు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి, కృష్ణాజిల్లాతో పా టు ఎన్టీఆర్, ఏలూరు, పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో వచ్చిన దరఖాస్తులను గుంటూరు డీఆ ర్వో ఖాజావలి పరిశీలిస్తున్నారు. ఈనెల 25లోగా పరిశీలన ముగించి 30న తుది జాబితా ప్రకటించనున్నారు. పరిశీలనకు అధికారులు, సిబ్బందిని నియమించినట్టు ఖాజావలి ఆంధ్రజ్యోతికి తెలిపారు.



ఏకే ఉర్దూ పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న షెహ్‌జాది

ఉర్దూ స్కూల్‌ను తనిఖీ చేసిన షెహ్‌జాది

భవానీపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): 41వ డివిజన్‌లోని ఎస్ఎంఏకే ఉర్దూ పాఠశాలను జాతీయ మైనార్టీ కమిషన్ మెంబర్ సయ్యద్ షెహజాది మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాటామంతి నిర్వహించి వారికందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఏమైనా ఇబ్బందులుంటే నేరుగా తనను సంప్రదించాలన్నారు. సర్వే కమిషనర్ ఆఫ్ వక్ఫ్ షేక్ నరీన్ బేగం, ఉమ్మడి కృష్ణా జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి అబ్దుల్ రబ్బాని పాల్గొన్నారు.

రేపు ఎస్‌ఆర్‌ఆర్‌లో జాబ్‌మేళా

గుణదల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగావకాశాలు కల్పించాలన్న ఆలోచనతో డీఆర్‌డీఏ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 12న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. జాబ్ మేళాకు టెన్త్ నుంచి పీజీ వరకు చదివినవారు ఎవరైనా హాజరుకావచ్చన్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ సంస్థ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి అధికారి డి.విక్టర్ బాబు జాబ్ మేళాను పర్యవేక్షించనున్నరన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యేవారు తమ సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో రావాలన్నారు. వివరాలకు 7799669907 నెంబరుకు కాల్ చేయాలని కోరారు.



రోడ్లను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యాన చంద్ర, అధికారులు

పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో రోడ్డు అభివృద్ధి

● కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో 17 ప్రాంతాల్లో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో (పీపీపీ పద్ధతి) రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యాన చంద్ర తెలిపారు. మంగళవారం నగరంలోని 17 ప్రాంతాల్లోని రోడ్లను కమిషనర్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. సర్కిల్-1 పరిధిలోని బీఆర్‌పీ రోడ్డు, నెహ్రూరోడ్డు, కేటీరోడ్డు కుమ్మరిపాలెం, సితార సెంటర్ నుంచి సీవీఆర్ ఫ్లై ఓవర్ వరకు 7.37 కిలోమీటర్ల రోడ్లను పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయబోతున్నట్టు తెలిపారు. అలాగే సర్కిల్-2లో బీఆర్‌టీఎస్ రోడ్డు, సాంబమూర్తిరోడ్డు, బీఎస్‌రాజురోడ్డు, సుమారు 7.27 కిలోమీటర్లు రోడ్లను, సర్కిల్-3లో హెచ్చీలైన్‌రోడ్డు, గురునానక్‌కాలనీ మెయిన్‌రోడ్డు, పిన్నమనేని పాలీక్లినిక్‌రోడ్డు, టిక్కిల్‌రోడ్డు, సిద్ధార్థ స్కూల్ రోడ్డు, జమ్మిచెట్టు సెంటర్ నుంచి సిద్ధార్థ సర్కిల్ వరకు మదర్ థెరిసా సర్కిల్ నుంచి అమ్మ కల్యాణ మండపం వరకు, పీవీపీ మాల్ నుంచి రమేష్ హాస్పటల్ వరకు 8.37 కిలోమీటర్ల మేరకు రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్టు కమిషనర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్‌రెడ్డి, ఈఈ సామ్రాజ్యం, ఏపీ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్కేటింగ్‌లో జెస్సీరాజ్‌కు రజతం



విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని పొల్లాచీ నగరంలో జరుగుతున్న 62వ జాతీయ రోలర్ స్కేటింగ్‌లో నగరానికి చెందిన 9వ తరగతి చదువుతున్న మాత్రపు జెస్సీరాజ్ రజతంతో సత్తా చాటింది. దేశ వ్యాప్తంగా వెయ్యి మంది క్రీడాకారులు పోటీపడగా, 14-17 ఏజ్ గ్రూప్‌లో జెస్సీరాజ్ సోలో డ్యాన్స్‌లో రజతాన్ని తన ఖాతాలో వేసుకుంది. జాతీయ పతకం సాధించిన జెస్సీరాజ్‌ను ఆర్టిస్టిక్ ఇండియన్ ఛైర్మన్ ప్రదీప్ మాల్వాయి, ఏపీ స్కేటింగ్ అసోసియేషన్ ఛైర్మన్ ఆకుల ప్రవీణ్‌కుమార్, ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి థామస్ చౌదరి, సీనియర్ కోచ్ సింహాద్రి అభినందించారు. విశేషమేమిటంటే ఈ పతకంతో ఇప్పటి వరకు జెస్సీరాజ్ సాధించిన పతకాల మైలురాయి ఆఫ్ సెంచరీకి చేరింది.

చైత్రదీపికకు కాంస్యం



ఇదే చాంపియన్‌షిప్‌లో 14-17 ఏజ్‌గ్రూప్‌లో నగరానికి చెందిన మరో క్రీడాకారిణి పి.చైత్రదీపిక కాంస్యంతో సత్తా చాటింది. రాష్ట్రం తరపున కపుల్ డ్యాన్స్ స్కేటింగ్‌లో దీటైన ప్రదర్శనతో కాంస్యం తన ఖాతాలో వేసుకుంది. చైత్రదీపికకు ఇది 11వ జాతీయ పతకం కావడం గమనార్హం. చైత్రదీపికను రైల్వేస్ డీసీఎం కే కమలాకర్‌బాబు, కృష్ణా వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రామకృష్ణారావు అభినందించారు.

కృష్ణా వర్శిటీ వాలీబాల్‌లో సిద్ధార్థకు రన్నరప్

నున్నలో ఇటీవల జరిగిన కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల వాలీబాల్ టోర్నీ పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల టీమ్ రన్నరప్‌ను వశం చేసుకుంది. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన అభినందన సభలో ప్రిన్సిపాల్ ఎం రమేష్, యాజమాన్యం, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ టీవీబీ కృష్ణారెడ్డి అభినందించారు. వర్సిటీ జట్టులో కళాశాలకు చెందిన లక్కీ, శివ అనే క్రీడాకారులు చోటు దక్కించుకున్నారు.

పేదరికం చదువుకు ఆటంకం కారాదు

● రాయల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలు ● ఇప్పటి వరకు రూ.కోటి వరకు పంపిణీ

పటమట-ఆంధ్రజ్యోతి: వారందరూ సమాజంలో ఉన్నతస్థానాల్లో ఉన్నవారే. సమాజానికి తమ వంతుగా ఏదో చేయాలనే తలంపుతో 2017లో వ్యవస్థాపక అధ్యక్షుడు పేటేటి పుల్లయ్య ఆధ్వర్యంలో రాయల్ సర్వీస్ ట్రస్ట్‌ను ప్రారంభించారు. కొంతమంది దాతలు, ట్రస్టీల ఆర్థిక సాయంతో ప్రారంభించిన మొదటి ఏడాది రూ.1.30లక్షలతో ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. ప్రస్తుతం రాయల్ సర్వీస్ ట్రస్ట్‌కు శీతాలం రాంబాబు అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ప్రతిభ కలిగిన పేద మధ్య తరగతి విద్యార్థులకు పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ఉపకారవేతనాలను అందజేస్తున్నామని రాంబాబు తెలిపారు. 2017 మొదలైన ఈ పంపిణీ 2024-25లో 257 మందికి రూ.22,00,00 అందజేశారు. ఈ మొత్తం ఇప్పటి దాకా రూ.కోటి చేరిందని సభ్యులు తెలిపారు. డిసెంబరు 8న మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఉపకార వేతనుల అందజేసినట్టు వారు తెలిపారు. సంస్థ ప్రారంభించినప్పుడు ఒక పేద విద్యార్థి ఎంఎస్ చేయటానికి అమెరికా వెళుతుంటే విమాన టిక్కెట్లను ట్రస్ట్ సమకూర్చిందన్నారు. ఈ ఉపకార వేతనాల పంపిణీకి రాష్ట్ర హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఆకుల శేష సాయిబాబా, అటామిక్ రీసెర్చి సెంటర్ రిటైర్డు సైంటిస్ట్ ఆర్వీ సుబ్బారావు, వైఎస్ కాలేజ్ కరస్పాండెంట్ డాక్టర్ చినమల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే ట్రస్ట్ ఆధ్వర్యంలో కండరాల బలహీనతతో బాధపడుతున్న ముగ్గురికి రూ.1.70 లక్షలు విలువైన పవర్ ఆపరేటివ్ వీల్‌ఛైర్స్ అందజేయాలని తెలిపారు. వివిధ వ్యాధులతో బాధలు పడుతున్న నలుగురికి వైద్య చికిత్స నిమిత్తం రూ.5.47లక్షలు ట్రస్ట్ అందజేసింది. లాక్‌డౌన్ సమయంలో 600 మందికి దినసరి శ్రామికులకు రూ.2,26,815 విలువైన నిత్యావసరాలను అందించినట్టు సభ్యులు తెలిపారు. నలుగురు పేద విద్యార్థులను దత్తత తీసుకుని ఫీజులు చెల్లిస్తున్నామని అధ్యక్షుడు రాంబాబు తెలిపారు. ట్రస్ట్‌కు ఉపాధ్యక్షుడిగా ఈమని దామోదరరావు, సెక్రటరీ తోట పద్మనాభరావు, ట్రెజరర్‌గా అంకం రామసాయి ప్రసాద్ కొనసాగుతున్నారని తెలిపారు.



విద్యార్థులకు ఉపకారవేతనాలు అందజేస్తున్న జస్టిస్ శేషసాయి



● నేను విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సెకెండియర్ చదువుతున్నాను. రాయల్ ట్రస్ట్ వారి ఆర్థిక సాయం నా చదువు కొనసాగించటానికి బాగా ఉపయోగపడుతుంది.
- దూళిపాళ మేఘన



● పనస పావని అనే క్రాంతి ట్రాన్స్‌పోర్టు చిరుద్యోగి కుమార్తె. దాత కుప్పాలి శ్రీనివాసరావు సౌజన్యంతో ఆమె చదువుకయ్యే ఖర్చు ట్రస్ట్ భరిస్తుంది. ప్రస్తుతం ఆమె ఎన్టీఆర్ వైద్య విద్యాలయంలో హౌస్ సర్జన్ పూర్తిచేసింది. ఇంతకన్నా ఆనందం ఏముంది.
- పేటేటి పుల్లయ్య, ట్రస్ట్ వ్యవస్థాపకులు



● ప్రతిభ ఉండి, అవకాశాలు, ఆర్థిక సంపత్తి లేక ఉన్నత విద్యను కొనసాగించలేని యువతను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ ఉపకార వేతనాలను అందజేస్తున్నాం. స్వయం శక్తితో ఉన్నతస్థాయికి చేరిన ప్రముఖులచే ప్రేరణ కలిగించే ఉపన్యాసాలను విద్యార్థులకు ఇప్పిస్తున్నాం.
- శీతాలం రాంబాబు, ట్రస్ట్ అధ్యక్షులు



● నేను ఒంగోలు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సెకెండియర్ చదువుతున్నా. నా చదువుకు రూ.6వేల ఖర్చు, ప్రతి ఏడాది రూ.80 వేలు రాయల్ ట్రస్ట్ చెల్లిస్తోంది. ట్రస్ట్‌కు నా కృతజ్ఞతలు. **- సాక్షి అనురాధ ,మెడికల్ విద్యార్థి**

సూర్యఘర్‌కు అంబాసిడర్లుగా ప్రజల్లో స్ఫూర్తి నింపాలి

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం (సౌర విద్యుత్) అమలుకు అంబాసిడర్లుగా ప్రజల్లో స్ఫూర్తి నింపి లబ్ధిదారులుగా రిజిస్ట్రేషన్ చేయించుకొనేలా ప్రోత్సహించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ, గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. దీనికి సంబంధించిన విధి విధానాలు, ప్రయోజనాలను వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు అత్యంత చేరువలో అందిస్తున్న గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు తొలుత పథకం కింద లబ్ధిపొందేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆపై తమ పరిధిలోని ప్రజలకు పథకంపై అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్ చేయించుకొనేందుకు చేయిపట్టి నడిపించాలన్నారు. పీఎం సూర్యఘర్ ద్వారా ఇంటి పైకప్పుపై రాయితీతో, అతి తక్కువ ఖర్చుతో సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకొని కరెంటు బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చన్నారు. విద్యుత్ శాఖ ఎస్ఈ ఎ.మురళీమోహన్, నోడల్ అధికారి ఎం.భాస్కర్ పాల్గొన్నారు.

జాతీయ మైనార్టీ కమిషనర్ మెంబర్‌ను కలిసిన కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక : జాతీయ మైనార్టీ కమిషన్ మెంబర్ సయ్యద్ షాహెజాదిని మంగళవారం విజయవాడలోని హోటల్ వివంతలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు.



షాహెజాదికి పుష్పగుచ్ఛం ఇస్తున్న కలెక్టర్



పాత సీసీరోడ్డుపై నిర్మించిన సీసీరోడ్డు, స్పష్టంగా కనిపిస్తున్న రోడ్డుపై రోడ్డు

రూ.80వేలు బిల్లు నిలిపేయండి

● రోడ్డుపై రోడ్‌ను తనిఖీ చేసిన అధికారులు

తోట్లవల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గరికపర్రు శివారు వేణుగోపాలపురంలో సీసీ రోడ్డుపై నిర్మించిన కొత్త సీసీరోడ్డుని మంగళవారం పంచాయితీరాజ్ ఈఈ సుధాకర్, డీఈ సురేష్, ఏఈ శరాబంధి రాజు పరిశీలించారు. సీసీ రోడ్డుపై మరో సీసీ రోడ్డు శీర్షిన మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. స్థానిక రైతు మైనేని తారాచంద్ ఈ రోడ్డుపై స్పందనలో కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి సైతం ఫిర్యాదు చేశారు. దీంతో సదరు ఈఈ, డీఈ తక్షణమే కొత్త సీసీ రోడ్డుని పరిశీలించి కింద ఉన్న పాత రోడ్డును కూడా చూశారు. ఇలా రోడ్డుపై రోడ్డు ఎందుకు వేయాల్సి వచ్చిందని ఈఈ ఆగ్రహం వ్యక్తం చేశారు. 2017లో సిమెంటు రోడ్డు వేశారని, రోడ్డు బాగున్నా ఉపాధి నిధులతో రూ.7.70 లక్షలతో సిమెంటు రోడ్డు వేశారని ఫిర్యాదుదారుడైన తారాచంద్ అధికారులకు తెలిపారు. పాత రోడ్డు పాడైందని అందుకే కొత్త రోడ్డు వేయటం జరిగిందని, గత జేఈఈ రోడ్డుకు ఎస్టిమేట్ వేశారని ఏఈ శరాబంధిరాజు వివరించారు. గ్రామంలో గ్రావెల్‌రోడ్లు ఉండగా సీసీ రోడ్డుపై మరో సీసీరోడ్డు వేయటాన్ని సదరు అధికారులు తప్పుపట్టారు. బిల్లులు చేయవద్దని, నిలిపేయాలని ఈఈ ఆదేశించారు. 40 మీటర్ల రోడ్డుకు సంబంధించి రూ.80 వేలు బిల్లు చేయవద్దని ఈఈ తెలిపారని ఏఈ శరాబంధిరాజు తెలిపారు. గ్రామ సర్పంచ్ వీరంకి రమాదేవి అధికారులను కలిశారు.

నూతన ఆవిష్కరణతోనే సాంకేతికాభివృద్ధి

● పాలిటెక్ ఫెస్ట్‌లో ఎమ్మెల్సీ అశోక్ బాబు

కృష్ణలంక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నేటి యువతలో ఆలోచన శక్తితో రూపొందించిన ఆవిష్కరణలో భవిష్యత్‌లో సాంకేతికాభివృద్ధికి ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్సీ పి.అశోక్ బాబు అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న రీజనల్ పాలిటెక్ ఫెస్ట్-2024ను మంగళవారం ఆయన సందర్శించి ఆవిష్కరణలను రూపొందించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన 15 పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు రూపొందించిన సుమారు 125 ఆవిష్కరణలను ప్రదర్శించడం గర్వకారణమన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, సీడ్ యాప్, ఎంఎస్ఎంఈ వంటివాటి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆలోచన చేస్తున్నాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం నిరుద్యోగ యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంగా కాగా అందులో 50 శాతం సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన ఉద్యోగాలుంటాయన్నారు. రియల్‌టైమ్ టెక్నాలజీస్‌కు సంబంధించి ప్రాక్టికల్ నైపుణ్యాలను మెరుగుపరుచుకొనేందుకు ఇలాంటి ఫెస్ట్‌లు ఎంతో దోహదపడతాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం.విజయసారథి, వివిధ విభాగాధిపతులు సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ ఎం.మధుసూధనరావు, కె.విజయభాస్కర్, బి.భీమానాయక్, ఎం.నాగరాజు, ఎ.శివప్రసాద్, టి.కొండారెడ్డి, బి.శైలజ, బి.శ్రీనివాసరెడ్డి, కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వివిధ పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపల్స్, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



రీజనల్ పాలిటెక్ ఫెస్ట్‌ను సందర్శించిన ఎమ్మెల్సీ అశోక్‌బాబు



జిందాల్ ప్రాజెక్టు నమూనాను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ. చిత్రంలో ఎమ్మెల్యే పుల్లారావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి తదితరులు

డంపింగ్ యార్డుల రహితంగా రాష్ట్రం

- వచ్చే ఏడాది అక్టోబరు 2 నాటికి తీర్చిదిద్దుతాం
- త్వరలో మరో ఐదు జిల్లాల్లో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ
- పల్నాడు జిల్లాలోని జిందాల్ ప్లాంట్ పరిశీలన

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వ్యర్థాల సమర్థ నిర్వహణ ద్వారా వచ్చే ఏడాది గాంధీ జయంతి (అక్టోబరు 2) నాటికి డంపింగ్ యార్డులు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. దానికోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో కృషి చేస్తున్నామని చెప్పారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడు పంచాయతీలో జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ని మంత్రి నారాయణ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో కాకినాడ, నెల్లూరు, కడప, కర్నూలు, అనంతపురంలలో కూడా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 2014-19 మధ్యలో ఘన వ్యర్థాల నిర్వహణపై వివిధ రాష్ట్రాలు, దేశాల్లో అధ్యయనం చేసి, ఉత్తమ విధానాలతో రాష్ట్రంలో 10 ప్రాంతాల్లో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. అందులో భాగంగా అప్పట్లో గుంటూరు, విశాఖపట్నం జిల్లాల్లో ప్లాంట్ల నిర్మాణ పనులు వేగంగా చేపట్టామన్నారు.

వైసీపీ అసమర్థ నిర్వహణ

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యర్థాల అసమర్థ నిర్వహణ వల్ల రాష్ట్రంలో 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త నిల్వలు పేరుకుపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన అనతి కాలంలోనే ఆ వ్యర్థాలను శుభ్రం చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. గత ప్రభుత్వం విధించిన చెత్తపన్నును రద్దుచేసి ప్రజలపై భారం తగ్గించామన్నారు. రాష్ట్రంలో రోజూ సుమారు 6,890 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని, ఉమ్మడి గుంటూరు జిల్లా, విశాఖలోని జిందాల్ ప్లాంట్లలో 2,160 టన్నుల వ్యర్థాలను(31 శాతం) ట్రీట్మెంట్ చేస్తున్నారని తెలిపారు. ఆ ప్లాంట్ల ఏర్పాటుతో 50-60 కిలోమీటర్ల పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ, నగర పంచాయతీల్లో వ్యర్థాల సమర్థ నిర్వహణకు మార్గం సుగమమైందన్నారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, తాగునీరు, రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అమృత్-2, ఏఐఐబీ నిధులు కేంద్రం నుంచి సక్రమంగా అందలేదన్నారు. త్వరలో వాటి సద్వినియోగంపై దృష్టి పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, ఎండీ అనిల్‌కుమార్‌రెడ్డి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీనివాసులు, జిందాల్ ఏపీ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) ఎంవీ చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు 400 పెన్షన్ న్యాయమా?

- 'సాధన' సభలో ఏపీసీపీఎస్ఈఏ నేతలు

విజయవాడ(ధర్నాచౌక్), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు రూ.4000 పెన్షన్ ఇస్తున్న ప్రభుత్వం ఉద్యోగులకు 400 పెన్షన్ ఇవ్వడం భావ్యమా అని సీపీఎస్ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్‌లో 'సాధన' పేరుతో మంగళవారం సభ నిర్వహించారు. గత ప్రభుత్వం దుర్మార్గంగా తమపై అక్రమంగా బనాయించిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోరుకొండ సతీష్, సీఎం దాస్ మాట్లాడుతూ వృద్ధులకు రూ. 4 వేలు ఇస్తున్న ప్రభుత్వం నలభై ఏళ్లుగా పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రం నాలుగు వందల పెన్షన్ ఇవ్వడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన సమయం వచ్చిందని రాష్ట్ర ప్రభుత్వానికి చెప్పారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా చిత్తశుద్ధితో ఉద్యోగుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ.శివారెడ్డి, జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగుల సమస్యలపై సీఎం చంద్రబాబుతో చర్చిస్తామన్నారు. 2004 ముందు నోటిఫికేషన్ ఇచ్చి ఉద్యోగంలో చేరిన వారికి సెంట్రల్ గవర్నమెంట్ మోమో 57 ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. సెంట్రల్ మోమో 41 ప్రకారం ప్రభుత్వం వాటాను 14 శాతానికి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్‌రాజు, ఆస్కారావు, ఏపీ సచివాలయం సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోట్ల రాజేష్, ఏపీటీఎఫ్ నేత భానుమూర్తి, ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి, అధిక సంఖ్యలో సీపీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

స్కానింగ్‌కు వెళ్లిన యువతి పట్ల అసభ్య ప్రవర్తన!

- బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడి అరెస్టు
- ఘటనపై ముఖ్యమంత్రి ఆగ్రహం.. కఠిన చర్యలకు ఆదేశం

మద్దిలపాలెం, డిసెంబరు 10: విశాఖపట్నం రామ్‌నగర్‌లో గల కేర్ ఆస్పత్రిలో స్కానింగ్‌కు వెళ్లిన ఓ యువతి పట్ల సంబంధిత సెక్షన్ ఇన్‌చార్జి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలు కేకలు వేస్తూ బయటకు రావడంతో కుటుంబ సభ్యులు విషయం తెలుసుకుని అతనికి దేహశుద్ధి చేశారు. ఇందుకు సంబంధించి సీఐ పి.రమణయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కైలాసపురం ప్రాంతానికి చెందిన 22 ఏళ్ల యువతి సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడింది. కుటుంబ సభ్యులను తీసుకుని కేర్ ఆస్పత్రికి వెళ్లింది. వైద్యులు పరిశీలించి యాంకిల్, పొట్ట స్కానింగ్ చేయించుకుని, రిపోర్టు తేవాలని సూచించారు. ఆమె అదే ఆస్పత్రిలోని ల్యాబ్‌కు వెళ్లగా స్కానింగ్ ఇన్‌చార్జి కె.ప్రకాష్ దుస్తులన్నీ తొలగించాలని చెప్పాడు. ఆ తర్వాత స్కానింగ్ నెపంతో ప్రైవేటు భాగాలు తాకడంతో యువతి కేకలు వేస్తూ రావడంతో ఆమె బంధువులు విషయం తెలుసుకుని ప్రకాష్‌కు దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజులు రిమాండ్ విధించింది. కాగా.. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీరియస్ అయ్యారు. యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

అగ్నిప్రమాదం వల్లే బాలిక మృతి

- నందికొట్కూరు ఘటన వివరాలు వెల్లడించిన పోలీసులు

నందికొట్కూరు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలో బాలిక మృతిపై అనేక ఆరోపణలు వస్తున్నాయని, అయితే ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరగడంతో బాలిక మృతి చెందిందని పోలీసులు చెప్పారు. ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, ఏఎస్పీ యుగంధర్ బాబు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ మంగళవారం నందికొట్కూరు సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపామని చెప్పారు. బాలిక గదిలో ఉన్న పెయింట్‌లో కలిపే టిన్నర్ డబ్బా తెరిచి ఉండడం, అలాగే వెలుగుతున్న మస్కిటో కాయిల్ కారణంగా మంటలు వ్యాపించాయని చెప్పారు. దీంతో బాలిక మంటల్లో కాలిపోయిందని చెప్పారు. బాలిక తాత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక రెండేళ్లుగా నందికొట్కూరులో తాత ఇంటి వద్ద ఉంటూ ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోందని తెలిపారు. మూడేళ్ల క్రితం వెల్దుర్తి మండలంలో పదో తరగతి చదువుతున్నప్పటి నుంచి బాలిక, రాఘవేంద్ర అనే యువకుడు ప్రేమించుకుంటున్నారని చెప్పారు. ఈ సాన్నిహిత్యంతోనే గత ఆదివారం రాత్రి నందికొట్కూరులో బాలిక తాత ఇంట్లో బాలికతో పాటు యువకుడు ఉన్నాడని తెలిపారు.

గుడివాడ

● గుడివాడ ● పామర్రు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	102, 110, 121
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

సెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.630



ఆలిండియా వాలీబాల్ అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు అజయ్

కూచిపూడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా అంతర్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీలకు మొవ్వ వీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి ఎం.అజయ్ ఎంపికైనట్లు పీడీ వల్లభనేని మణి ప్రసాద్ తెలిపారు. ఈనెల 18 నుంచి కేరళలోని తిరువనంతపురంలో జరిగే పోటీల్లో అజయ్ పాల్గొంటారన్నారు. అజయ్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ మాధవి, పీడీ మణి ప్రసాద్, కళాశాల అధ్యాపకులు అభినందించారు.



కేక్‌ను కట్ చేస్తున్న పిన్నమనేని బాబ్జీ

ఘనంగా బాబ్జీ జన్మదిన వేడుకలు

గుడివాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అర్బన్ బ్యాంకు మాజీ ఛైర్మన్, సీనియర్ నాయకులు పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జీ) జన్మదిన వేడుకలను మంగళవారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక భాస్కర్ థియేటర్‌లో పిన్నమనేని అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కట్ చేశారు. పలువురు పట్టణ ప్రముఖులు ఆయన జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ గోకరకొండ బలరాం, టిడిపి నాయకులు గుత్తా చంటి, పంద్రాజు సాంబశివరావు, పాలడుగు ధర్మపాల్, కంచర్ల సుధాకర్, సయ్యద్ జబీన్, వంశీ, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో వండర్ కిడ్జ్ విద్యార్థు ప్రతిభ



గుడివాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల గుంటూరులో నిర్వహించిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో వండర్ కిడ్జ్ విద్యార్థులు ప్రతిభను కనబరచినట్లు పాఠశాల కరస్పాండెంట్ విష్ణు చైతన్య తెలిపారు. రాజేంద్రనగర్‌లోని పాఠశాల ఆవరణలో పతకాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కరాటే పోటీల్లో విషా స్వర్ణపతకం, ప్రియాంక జైన్, చోష్య కాంస్య పతకం సాధించడం అభినందనీయమన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ వై.ఎస్.వి కృష్ణకుమారి, ఇన్‌చార్జ్‌లు స్వప్న, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

పెయింటర్‌కు న్యాయం చేయాలి

గుడివాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : డాబాపై నుంచి పడి గాయాల పాలైన పెయింటర్ పామర్తి సురేష్‌కు న్యాయం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి రేపాని కొండ డిమాండ్ చేశారు. గౌరీశంకరపురంలో కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కొండ మాట్లాడుతూ సురేష్‌కు న్యాయం చేయాలని పలుమార్లు ఇంటి యజమానులను సంప్రదించిన వారు స్పందించడం లేదన్నారు. ఇప్పటికే సురేష్‌కు రూ.2 లక్షలు వరకు వైద్యానికి ఖర్చు అయ్యిందని, వెంటనే న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో కార్మికులతో కలిసి భవనం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్మికులు పామర్తి హరీష్, వెంకటేష్, పెయింటర్లు పాల్గొన్నారు.



టిడ్కో కాలనీలో ఆందోళన తెలుపుతున్న మహిళలు

టిడ్కో కాలనీ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

గుడివాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో కాలనీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మౌలిక వసతులను వెంటనే కల్పించాలని ఐద్వా కార్యదర్శి పి.రజిని డిమాండ్ చేశారు. మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీలో లబ్ధిదారులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. టిడ్కో కాలనీ వాసుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందన్నారు. మౌలికవసతులు కల్పించకుండానే గృహాలను అందించి గత వైసీపీ ప్రభుత్వం టిడ్కో లబ్ధిదారులను మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం టిడ్కో కాలనీ సమస్యలను పరిష్కరించేలా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కృషి చేయాలని కోరారు. టిడ్కో లబ్దిదారులు బి.రాణి, ఓ.భారతి, పి.రాజేశ్వరీ, ఆర్.దివ్య, టి.వీరమ్మ, డి.పద్మకుమారి,వై.సత్యవతి, ఎస్.మేరీ, పి.లావణ్య, పి.అనిత, భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి ఆర్.కొండ తదితరులు పాల్గొన్నారు.



సీపూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులతో మాట్లాడుతున్న ఏవో బోలెం అనంతలక్ష్మి

రెండు రోజులు వరికోతలు కోయొద్దు

గుడివాడ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు వాతావరణ శాఖ వర్షాలు ఉన్నాయని చెబుతున్న నేపథ్యంలో రెండు రోజులపాటు వరి కోతలు కోయవద్దని మండల వ్యవసాయ శాఖ అధికారిణి బోలెం అనంతలక్ష్మి తెలిపారు. మండలం సీపూడి, కాశిపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. మినుము విత్తనాలను చల్లేటప్పుడు పరిస్థితులను చూసి చల్లుకోవాలని తెలిపారు. పల్లాకు తెగులు నివారణకు ముందుగానే మందు చల్లుకోవాలని తెలిపారు. రైతులు మిషన్ల ద్వారా కోతలు కోసి ధాన్యాన్ని రోడ్లపై ఉంచుకోవద్దని కోరారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ ఉద్యోగులను సంప్రదించాలని తెలిపారు. విఏఏలు శ్రీకాంత్, ఇమ్రాన్, రైతులు పాల్గొన్నారు.


చినపారుపూడి గ్రామ సచివాలయం వద్ద కరపత్రాలు ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ రంగారావు


కుమ్మమూరులో అర్జీలు ఇస్తున్న ప్రజలు



మందపాడులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రామకోటేశ్వరరావు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

పెదపారుపూడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వై.రంగారావు అన్నారు. చినపారుపూడి గ్రామ సచివాలయం వద్ద సభ జరిగింది. గ్రామస్థుల నుండి రెవెన్యూ తదితర సమస్యలపై 10 అర్జీలు తహసీల్దార్ స్వీకరించారు. దళిత ఏరియాలో పర్యటించి రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు తీరును పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు చేశారు. రీ సర్వే డిటి సుందరరావు, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వో కృపారావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, సర్పంచ్ నగుళ్ల శ్రీనివాసరావు, పృథ్వీ పాల్గొన్నారు.



పుట్టగుంటలో అర్జీ ఇస్తున్న మద్దాలి ఇస్సాకు


తాడంకిలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ నవీన్‌కుమార్

బందరు కాలువ కట్టను పటిష్టం చేయండి

తోట్లవల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కుమ్మమూరులో మంగళవారం సర్పంచ్ బొమ్మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. నోడల్ తహసీల్దార్ ఎం కుసుమకుమారి, వీఆర్వోలు బాల కోటి, బసవయ్య ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. బందరు కాలువ కట్ట గండ్లు పడుతోందని, కట్ట పటిష్టానికి చర్యలు తీసుకోవాలని, శివారు గ్రామం మద్దువానిగూడెం వద్ద ఏనుగులకోడు డ్రైన్‌పై దెబ్బతిన్న కాలిబాట వంతెనను పునర్నిర్మించాలనిఅర్జీలు వచ్చినట్టు తెలిపారు.

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి

నందివాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దొంగ పట్టాలతో ఆక్రమించుకున్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరుతూ, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి మద్దాల ఇస్సాకు పుట్టగుంట రెవెన్యూ సదస్సులో వినతిపత్రం అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో మంత్రి కొడాలి నాని అండతో ఎ7.50 సెంట్లు ప్రభుత్వ భూ మి ఆక్రమించుకుని సుమారు లక్షా 50 వేల వరకు మట్టి అమ్ముకున్నారన్నారు. బుడమేరు కట్టను సైతం తవ్వి మట్టి అమ్ముకున్నారన్నారు. కలెక్టర్ స్పందించి పుట్టగుంట గ్రామ పరిధిలో వైసీపీ నాయకుల చెరలోని ప్రభుత్వ భూమిని స్వాధీనపర్చుకుని స్థలాలు లేని వారికి పంపిణీ చేయాల్సిందిగా కోరారు.

మందపాడులో...

గుడివాడ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మందపాడు రైతులు చాలా చైతన్యవంతులని తహసీల్దార్ రామకోటేశ్వరరావు అన్నారు. మందపాడు రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ, రైతుల అర్జీలను వెంటనే పరిష్కరించటానికి కృషి చేస్తామని తెలిపారు. సర్వే నెంబర్లు, అడంగల్ మార్పులు, చేర్పులు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం చేస్తామన్నారు. వెంటనే పరిష్కరించటానికి తమ సిబ్బందికి ఆదేశించామన్నారు. రెవెన్యూ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

తాడంకి రెవెన్యూ సదస్సులో 11 అర్జీలు

పమిడిముక్కల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని పమిడిముక్కల తహసీల్దార్ కె.నవీన్‌కుమార్ అన్నారు. తాడంకి రెవెన్యూ సదస్సులో 11 అర్జీలు స్వీకరించారు. సర్వేయర్ సుధీర్‌కుమార్, ఆర్ఐ కిరణ్‌కుమార్, జడ్పీటీసీ సభ్యురాలు వై.రమణకుమారి తదితరులు పాల్గొన్నారు.


పెంజేంద్ర సొసైటీ వద్ద మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు రైతులు

ధాన్యం కొనగోళ్లపై అసత్య ప్రచారం తగదు

గుడ్లవల్లేరు, డిసెంబరు 10 : పెంజేంద్ర పీఏసీఎస్ సొసైటీ పరిధిలో రైతు సేవా కేంద్రాల ద్వారా 12,117 క్వింటాళ్ల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేశారని పెంజేంద్ర మాజీ సర్పంచ్ బొప్పన శివప్రసాద్ తెలిపారు. వైసీపీ నాయకులు కొందరు రైతు సేవా కేంద్రాల ద్వారా తమ ధాన్యం అమ్ముకుని, ప్రభుత్వం ధాన్యం కొనడం లేదంటూ అసత్య ప్రచారం చేస్తూ, నీలి మీడియాలో కథనాలు రాయించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంజేంద్ర రైతు సేవా కేంద్రంలో 166 మంది రైతులు 30,294 గన్నీబ్యాగ్‌ల ద్వారా 12,117 క్వింటాళ్ళ ధాన్యం అమ్మగా రూ.2.80 కోట్లు రైతులకు ప్రభుత్వం జమ చేసిందన్నారు. గత ప్రభుత్వంలో ధాన్యం ఎప్పుడు కొంటారో, ఎప్పుడు డబ్బు చెల్లిస్తారో తెలిసేదికాదని ఆయన అన్నారు. ప్రస్తుతం రెండు రోజుల్లోనే డబ్బు చెల్లిస్తున్నారని శివప్రసాద్ అన్నారు. ఇప్పటికైనా అసత్య ప్రచారాలు,అసత్య ఆరోపణలను వైసీపీ నాయకులు మానుకోవాలని హితవు పలికారు.


గురజాడ ఎస్సీకాలనీలో అగ్ని బాధితులకు ఆర్థిక సాయం, దుప్పట్లు అందజేస్తున్న ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ నేతలు

అగ్నిబాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

పమిడిముక్కల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గురజాడ ఎస్సీ కాలనీ అగ్నిబాధిత నాలుగు కుటుంబాలకు ఏజీ అండ్ ఎస్‌సీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం దుప్పట్లు, రూ.2వేల చొప్పన ఆర్థిక సాయం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు సత్తార్, కార్యదర్శి పూర్ణచంద్రరావు, గౌరవ అధ్యక్షుడు నూకల సాంబశివరావు, బాపిరాజు, బ్రహ్మేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సలీమ్, తులసీరామ్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నా రు.


బాలుడు తండ్రి మల్లా గోపికి ప్రభుత్వం నుండి రూ. 50 వేల ఆర్థిక సాయం అందచేస్తున్న ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా

బాలుడి కుటుంబానికి రూ, 50 వేల ఆర్థిక సాయం

పమిడిముక్కల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. వీరంకిలాకు ఎస్సీ కాలనీకి చెందిన మల్లా గోపీకృష్ణ కుమారుడు గౌతమ్ ఇటీవల ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం నుంచి రూ. 50 వేల ఆర్థిక సాయాన్ని మంగళవారం ఆయన అందజేశారు. బాలుడు కాల్వలో పడి మృతి చెందడం విచారకరమన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, ఎస్టీ వెల్ఫేర్ ఈవో కె.కన్నమనాయుడు, తహసీల్దార్ కె.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

కూచిపూడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం కృష్ణాజిల్లా 25 మహాసభలు ఈ నెల 15 నుంచి మూడు రోజులపాటు చల్లపల్లిలో నిర్వహిస్తున్నట్లు మొవ్వ మండల పార్టీ కార్యదర్శి శీలం నారాయణరావు తెలిపారు. బహిరంగ సభలో కేంద్ర కమిటీ సభ్యురాలు సుంకర పుణ్యవతి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబురావు, వి.ఉమామహేశ్వరరావు, వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు చేబ్రోలు బసవపూర్ణ తదితరులు పాల్గొంటారని తెలియజేస్తూ ఈ మహాసభలను విజయవంతం చేయాల్సిందిగా నారాయణరావు కోరారు.

శివాలయం వీధి రహదారి నిర్మాణం చేపట్టాలి



పామర్రు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శివాలయం మార్గంలో పంచాయతీ రహదారి గోతులతో అధ్వానంగా ఉంది. ఈమార్గంలో రాకపోకలు నిర్వహించడానికి వాహనదారులు, ప్రజలు, భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి నిర్మాణ పనులకు గతంలోనే నిధులు మంజూరయ్యాయని అధికారులు చెబుతున్నా పనుల ప్రక్రియ అడుగు ముందుకు పడడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రహదారులకు పెద్దపీట వేస్తున్నామంటున్న కూటమి ప్రభుత్వ పాలకులు, గ్రామపంచాయతీ పాలకులు స్పందించి రహదారి పనులు చేపట్టాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కార్యదర్శి అబ్దుల్ సలీం మాట్లాడుతూ, త్వరలో రహదారి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సెమీక్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కుమార్ రాజా



పెదపారుపూడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిన్నపారుపూడి కృపా ప్రార్థనా మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొని మాట్లాడారు. ప్రేమ, సామరస్య సందేశాన్ని వ్యాప్తి చేసేందుకు ఏసుక్రీస్తు ఈ లోకానికి వచ్చారన్నారు. యువత క్రీస్తు బోధనలను పాటిస్తే జీవితంలో సన్మార్గంలో నడవగలరని తెలిపారు.


మానవహారం నిర్వహిస్తున్న ఎంపీడీవో, ఉద్యోగులు

మరుగుదొడ్డి సక్రమంగా వాడాలి

పెదపారుపూడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి ఆత్మగౌరవ చిహ్నం మరుగుదొడ్డి అని, ఉన్నవారు సక్రమంగా వినియోగించటం ఎంత ముఖ్యమో, లేని వారు కట్టుకోవటం కూడా అంతే ముఖ్యమని ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి అన్నారు. ప్రపంచ మానవహక్కుల దినోత్సవం, ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మానవహారం నిర్వహించారు. మరుగుదొడ్ల అవశ్యకతను వివరిస్తూ నినాదాలు చేశారు. ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి దీక్షాపరులకు చద్ది



గుడివాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వీరాంజనేయస్వామి దేవస్థానంలో ప్రతి మంగళవారం ఆంజనేయ స్వామి దీక్షాపరులకు చద్ది ఏర్పాటు చేస్తున్నారు. దాతలు దిమ్మిటి గంగయ్య, సుధాకర్, లుక్కా ప్రశాంత్ సహకారంతో మంగళవారం చద్ది ఏర్పాటు చేశారు. కురాకుల బాబి, రేవంత్, వీరబాబు, నాగరాజు, సురేష్, గోపి, వెంకన్న, భక్త బృందం పాల్గొన్నారు.

జాతీయ సాంస్కృతిక పోటీలకు

ఆంధ్ర నలంద విద్యార్థులు


బహుమతి అందుకుంటున్న ఆంధ్ర నలంద విద్యార్థులు

గుడివాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 9,10 తేదీల్లో పోరంకి మురళి రిసార్ట్స్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో గుడివాడ ఆంధ్ర నలంద మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. ఈ పోటీల్లో డ్రామా విభాగంలో ఆంధ్ర నలంద విద్యార్థులు ప్రదర్శించిన "ద్వారబంధాల చంద్రయ్య నాయుడు" నాటిక ప్రథమ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. బాలరంగ్ ఉత్సవాల కోసం నిర్వహించిన గిరిజనుల "ధింసా నృత్యం" రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించింది. పాఠశాల గణిత ఉపాధ్యాయులు పి.వి సత్యనారాయణ నాటిక రచన చేయగా, పి.కృష్ణహితేష్ దర్శకత్వం వహించారు. విద్యార్థులకు గిరిజన నృత్యం ధింసాకి పాఠశాల పూర్వ విద్యార్థి కుసుమ దర్శకత్వం వహించారు. జాతీయ స్థాయిలో కళా ఉత్సవ్, బాలరంగ్ ఉత్సవాలకు పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం పట్ల గుడివాడ డీవైఈవో ఐ.పద్మారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.లక్ష్మీ స్రవంతి, ఉపాధ్యాయులు, పలు సాహితీ సంస్థల ప్రతినిధులు అభినందించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	102, 110, 121
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.630





రామకోటేశ్వరరావు భార్య దుర్గాభవానీకి చెక్కు అందజేస్తున్న ఎస్పీ

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటా : ఎస్పీ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ ఆర్. గంగాధరరావు అన్నారు. పమిడిముక్కల పోలీసుస్టేషన్ కానిస్టేబుల్ ఎం. రామకోటేశ్వరరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సందర్భంగా పోలీసుశాఖ మంజూరు చేసిన రూ.50 వేలు, ఇతర ఖర్చులు రూ. 25 వేల చెక్కులను మంగళవారం రామకోటేశ్వరరావు భార్య ఎం. దుర్గాభవానికి ఆయన అందజేశారు.



మానవ హక్కుల పరిరక్షణ సంఘం క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

మానవ హక్కులను పరిరక్షించాలి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మానవ హక్కులను పరిరక్షించాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. హ్యూమన్ రైట్స్‌డే సందర్భంగా మంగళవారం మానవ హక్కుల పరిరక్షణ సంఘం క్యాలెండర్లను మంత్రి కొల్లు రవీంద్ర, బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ ఆవిష్కరించారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, పేద, బడుగు, మైనారిటీ, మహిళల హక్కులకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా నేరమన్నారు. మానవతా దృక్పథంతో తోటి మనుషులను ప్రేమించాలన్నారు. ఎదుట మనిషికి కష్టం కలిగించే విధంగా ప్రవర్తించకూడదన్నారు. ఏపీ స్టేట్ మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు ఎం.జె. కిషోర్, ప్రధాన కార్యదర్శి జొన్నల వరప్రసాద్, శ్రీనివాసరావు, నాగార్జున, గుప్తా తదితరులు పాల్గొన్నారు.



జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది మత్తి వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

హక్కులతోపాటు బాధ్యతలను గుర్తెరగాలి

అవనిగడ్డ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగం కల్పించిన హక్కులు సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను గుర్తెరిగి మసలుకోవాలని జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రముఖ న్యాయవాది మత్తి వెంకటేశ్వరరావు అన్నారు. మానవహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అవనిగడ్డ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మానవహక్కులపై అవగాహన కల్పించారు. మత్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవటంతోపాటు భారతదేశ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాలను బాధ్యతతో నిర్వహించాలని సూచించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎన్.నరసింహారావు, ఎన్ఎస్ఎస్ యూనిట్ కో-ఆర్డినేటర్ అన్నపరెడ్డి శ్రీనివాసరావు, జనసేన నేత రాజనాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు. న్యాయవాది వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు.

మహిళలు, బాలికలపై హత్యలు, లైంగిక వేధింపులను అరికట్టాలి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాలికలు, మహిళలపై హింస, అత్యాచారం, లైంగిక వేధింపులను ప్రభుత్వాలు అరికట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మచిలీపట్నం నగర కార్యదర్శి కొడాలి సుజాత డిమాండ్ చేశారు. బుట్టాయిపేటలోని జ్యోతీబాపూలే విజ్ఞాన కేంద్రంలో మచిలీపట్నం నగర కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మహిళలకు సమాన భాగస్వామ్యం, న్యాయం, భద్రత ప్రభుత్వ పరంగా అందాలన్నారు. మహిళా సంఘ నగర అధ్యక్షురాలు సిహెచ్. విజయలక్ష్మి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్. రాజేష్, కొడాలి శర్మ, సీఐటీయూ జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం, జిల్లా నాయకులు టి. చంద్రపాల్, ఎన్.ఎస్. నారాయణ, సిహెచ్. జయరావు, టి. చాందిని, దుర్గ, సిహెచ్. అరుణకుమారి, ఎం. పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీటీ సత్యనారాయణ అన్నారు. బందరు మండలం అరిసేపల్లి, గుండుపాలెం, రుద్రవరం తదితర గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు భూ సమస్యలపై ఎక్కువ అర్జీలు సమర్పించారు. మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, తలారి సోమశేఖర్, కుంచే నాని, రామధాని వేణు, అమ్మిరెడ్డి శివయ్య, చండిక పాండురంగారావు, చండిక ఉపేంద్ర, రాజు వెంకట రామారావు, బొప్పూడి చంటి, కాగిత నాగరాజు, సాయిరామ్, సూరిబాబు పాల్గొన్నారు.

పెడన/ పెడన రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పెడన మండలం బల్లిపర్రు, కాకర్లమూడి గ్రామాలలో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మొత్తం 34 అర్జీలను అధికారులు స్వీకరించారు. సర్వేకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వచ్చాయి. తహసీల్దార్ కె. అనిల్‌కుమార్, డీటీలు నరసింహారావు, విజయలక్ష్మి, ఆర్ఐ సల్మా, వీఆర్వో ప్రసాద్, సర్వేయర్ దాసు పాల్గొన్నారు.

మోపిదేవి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కె.కొత్తపాలెం గ్రామంలో తహసీల్దార్ ఎం.శ్రీవిద్య అర్జీలు స్వీకరించారు. రైతులు భూముల సమస్యలు ఉంటే ధ్రువపత్రాలతో అర్జీ సమర్పించాలన్నారు. గ్రామసభలోనే అప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారిణి జోగి ప్రవీణ, సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవీ, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, మండల సర్వేయర్ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి కె.రామకోటేశ్వరరావు, వీఆర్వో నీలికాంత్, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



డీటీ సత్యనారాయణకు అర్జీ ఇస్తున్న మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ అనిల్‌కుమార్



కోడూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనునాయక్

కోడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతుల భూముల సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీను నాయక్ తెలిపారు. విశ్వనాథపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల వద్ద నుంచి అడంగల్ సవరణలు, పట్టాదారు పాస్ పుస్తకాల కోసం 23 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.



గూడూరు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న స్వామి

గూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గూడూరు తహసీల్దార్ డి. రాజ్యలక్ష్మి అర్జీలు స్వీకరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు పోతన స్వామి, స్పెషల్ ఆఫీసర్ బాషా, జనసేన నాయకుడు పోతన రామోజీ, ఎన్‌పి బేగ్, తోట వేణు, ఆర్ఐ రాధ, వీఆర్వో కరీముల్లా, శ్రీకాంత్, పి. కాకుళేశ్వరరావు, కె. అంజిబాబు, కోడె వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాగబాబుకు శుభాకాంక్షలు తెలిపిన బుద్ధప్రసాద్

అవనిగడ్డ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు మంత్రివర్గంలో చేరనుండటం శుభపరిణామమని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. జనసేన పార్టీ బలోపేతానికి అనునిత్యం పవన్ కల్యాణ్‌తో ఉంటూ శ్రమించిన నాగబాబు కు కూటమి ప్రభుత్వంలో సముచిత గుర్తింపు లభించటం సంతోషదాయకమన్నారు. మంత్రిగా నాగబాబు ప్రజల అభిమానం పొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

శేషుబాబు శుభాకాంక్షలు



అవనిగడ్డ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ మండల అధ్యక్షులు గుడివాక శేషబాబు మంగళవారం నాగబాబును కలసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అభ్యున్నతి కోసం నాగబాబు చేసిన కృషికి దక్కిన గౌరవం మంత్రి పదవి ఇవ్వడం అని అన్నారు. నాగబాబు కు పదవి పట్ల రాయపూడి వేణుగోపాలరావు హర్షం వ్యక్తం చేశారు.



కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో యూనియన్ బ్యాంకు ప్రొబేషనరీ ఆఫీసర్లు

యూనియన్ బ్యాంకు ప్రొబేషనరీ అధికారులు కృషి విజ్ఞాన కేంద్రం సందర్శన

ఘంటసాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రాన్ని మచిలీపట్నం యూనియన్ బ్యాంక్ ప్రొబేషనరీ ఆఫీసర్లు గ్రామీణ అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం సందర్శించారు. కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి కృషి విజ్ఞాన కేంద్రం విధులు, పని తీరు, మినుము విత్తన ఉత్పత్తిని గురించి వివరించారు. వ్యవసాయ విస్తరణ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ నవీన్ కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణా కార్యక్రమాలను వివరించారు. షేడ్ నెట్‌లో మొక్కల పెంపకం, వివిధ వరి రకాలు, న్యూట్రిగార్డెన్, కోళ్ల పెంపకం, మేకల పెంపకం, కొరమేను చేపల పెంపకం గురించి వివరించారు.

జ్యూయలరీ పార్కులో ఉచిత శిక్షణ 16 నుంచి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, మచిలీపట్నం ఇమిటేషన్ జ్యూయలరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఈనెల 16వ తేదీ నుంచి ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు ఇమిటేషన్ జ్యూయలరీ పార్కు మెంబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి అంకెం జి. తేంద్రకుమార్ తెలిపారు. శిక్షణ అనంతరం అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9966489796కు ఫోన్ చేయవచ్చన్నారు.



బావిశెట్టివారిపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో పాల్గొన్న నేతలు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం

కోడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని మండల జనసేన పార్టీ అధ్యక్షులు మర్రే గంగయ్య అన్నారు. పిట్టలంక గ్రామ శివారు బావిశెట్టివారిపాలెం గ్రామంలో 80 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ బావిశెట్టి ప్రభాకర్‌రావు, ఎంపిటిసి సైకం భాస్కరరావు, కాగిత రామారావు, పూతబోయిన సీతారత్న సాయిబాబు, కోట రాంబాబు, తోట సోమశేఖర్, గుత్తి ప్రసాద్, తోట దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



కోడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కె.చాణక్య అన్నారు. వి.కొత్తపాలెం గ్రామంలో గ్రామ ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ, ఆధార్ చెప్పమని అడిగిన స్పందించొద్దన్నారు. డ్రగ్స్ కేసులు అరెస్టు అయ్యారని వెంటనే నగదు ఫోన్ పే చేస్తే వదిలేస్తామని ఇలా అనేక రకాలుగా సైబర్ నేరగాళ్లు భయపెడుతుంటారని, అలాంటి సంఘటనలు ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు.

పైడమ్మ జాతర నిర్వహణ సందర్భంగా

పెడన మున్సిపాల్టీకి రూ.11 లక్షలు, ఆలయానికి రూ.16.92 లక్షల ఆదాయం

పెడన, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పైడమ్మతల్లి జాతర ఉత్సవాలు పెడన మునిసిపాలిటీకి రూ. 11 లక్షల ఆదాయాన్ని సమకూర్చిపెట్టాయి. ఉత్సవ ప్రాంగణంలోనూ, గూడూరు రోడ్డుకు ఇరుపక్కలా ఏర్పాటయ్యే అంగళ్ల నుంచి రుసుము వసూలు చేసుకునే హక్కుకు మునిసిపాలిటీ బహిరంగ వేలం నిర్వహించగా ఎలిగట్ల ప్రసాద్‌అందరికంటే ఎక్కువగా రూ. 11 లక్షలకు పాట హక్కును దక్కించుకున్నాడు. ఈ వేలం ద్వారా మునిసిపాలిటీకి గత ఏడాది కంటే ఈ ఏడాది రూ. 6 లక్షలు అదనపు ఆదాయం లభించింది. జాత ర ఉత్సవాలు పైడమ్మతల్లి దేవస్థానానికి రూ. 16 లక్షల 92 వేలు ఆదాయాన్ని సమకూర్చిపెట్టాయి. దేవస్థానం చుట్టూ ఖాళీస్థలంలో ఏర్పాటయ్యే అంగళ్లు ఇతరాల నుంచి రుసుము వసూలు చేసుకునే హక్కుకు దేవాదాయ శాఖ నిర్వహించిన బహిరంగ వేలంలో దేవస్థానానికి భారీ ఆదాయం లభించింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది దేవస్థానానికి అదనంగా రూ. లక్షా 80 వేల ఆదా యం లభించింది.




వరి కోతలు వాయిదా వేయండి

అవనిగడ్డ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వర్ష సూచనలు ఉన్నందున వరి కోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.జయప్రదం సూచించారు. శివారు ప్రాంతంలోని రైతు కె.ఈశ్వరరావు పొలంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మినుము పైరు తొలి దశలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయశాఖాధికారి శౌరమ్మ, వీఏఏ కొక్కిలిగడ్డ తనూజ పాల్గొన్నారు.

హైందవ శంఖారావం కరపత్రాల ఆవిష్కరణ

ఘంటసాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జనవరి 5వ తేదీన విజయవాడలో జరగబోయే హైందవ శంఖారావం కరపత్రాలను మంగళవారం శ్రీకాకుళం గ్రామంలో ఆవిష్కరించారు. విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా అర్చక పురోహితుల విభాగం ప్రముఖ్ అగ్నిహోత్రం రాధాకృష్ణ నాగ వెంకట వంశీధర్ ఆధ్వర్యంలో తమ్మన సోమేశ్వరరావు కరపత్రాలను ఆవిష్కరించారు. తమ్మన పవన్, తమ్మన శ్రీనివాసరావు, దాసం రామకృష్ణ, లంక వంశీ, వాడపల్లి శ్రీరామ్, మురారి సతీష్, వినయ్, సాయి, సిద్దు, ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు బోనస్ నగదు అందిస్తున్న బాబురావు

పాడి రైతులకు బోనస్ పంపిణీ

నాగాయలంక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాగాయలంక పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం 121 మంది పాడి రైతులకు బోనస్‌ను పంపిణీ చేశారు. ఆగస్టు నుంచి నవంబరు 30 వరకు పాలు పోసిన 121 మంది పాడి రైతులకు రూ.83,260 లను సంఘ అధ్యక్షులు తలశిల బాబురావు, అధికారి మోర్ల వరప్రసాద్, డైరెక్టర్లు కలసి లబ్ధిదారులకు నగదును అందజేశారు. ఎక్కువ పాలు పోసిన పాడి రైతు తలశిల నరేంద్రను సంఘం అభినందించారు. రైతులు పాల్గొన్నారు.



విత్తన శుద్ధి తప్పనిసరి

మోపిదేవి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రబీ సాగులో చేపట్టే మినుము పంటలో విత్తన శుద్ధి చేయటం ద్వారా పలు రకాల తెగుళ్లను అరికట్టగల్గుతారని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధారాణి తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. నిర్వహించారు. సుధారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.స్వప్న మినుము యాజమాన్యంలో భాగంగా పల్లాకు తెగులు, బంగారు తీగ, ఎలుకల నివారణ వంటి అంశాలపై రైతులకు ప్రదర్శనా పూర్వకంగా అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు నవీన్, మంజువాణి, కృష్ణవేణి, రైతులు జొన్నలగడ్డ పిచ్చేశ్వరరావు, వేములపల్లి పిచ్చేశ్వరరావు, మాధవరావు, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప, భవానీ మాలధారులకు ప్రత్యేకంగా అన్నప్రసాదం ఏర్పాటు

మోపిదేవి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో అయ్యప్ప, భవానీ మాలధారులకు ప్రత్యేకంగా అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. స్వామి వారి ఆలయంలో జరిగే అన్నప్రసాద భోజన శాలలో మాలధారణ చేసిన దీక్షాపరులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.

విశ్వనాథపల్లి సబ్ స్టేషన్ పరిధిలో

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

కోడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విశ్వనాథపల్లి సబ్ స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఉయ్యూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.కృష్ణ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో గల పిట్టలంక రూరల్ ఫీడర్, ఎక్స్‌ప్రెస్ ఫీడర్ ఆర్‌డీఎస్ఎస్ పనుల కారణంగా ఉదయం 10 గటంల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులందరూ గమనించి సహకరించాల్సిందిగా కోరారు.

కమ్యూనిస్టు యోధుడు కృష్ణారావు కన్నుమూత

అవనిగడ్డ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దివి ప్రాంతంలో కమ్యూనిస్టు యోధుడిగా గుర్తింపు పొందిన సింహాద్రి కృష్ణారావు (85) మంగళవారం కన్నుమూశారు. రైతు కూలీ సంఘం, విరసం, ఏపీసీఎల్‌సీ తదితర ప్రజా సంఘాల్లో పని చేసిన సింహాద్రి కృష్ణారావు గడిచిన కొద్దికాలంగా అనారోగ్యంతో స్వగ్రామంలోనే ఉంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

సుస్థిర అభివృద్ధి సాధనపై పంచాయతీ సర్పంచ్‌లకు శిక్షణ

చల్లపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మంగళవారం చల్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీడీవో డాక్టర్ అనగాని వెంకట రమణ ప్రారంభించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు నిర్దేశించిన అంశాలను వివరించారు. పంచాయతీ కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు, ద్రాక్షాయణి, ఓంకార్‌లు వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈవోఆర్డీ రవిశంకర్, సర్పంచ్‌లు పైడిపాముల కృష్ణకుమారి, డొక్కు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెడన రూరల్ : సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల అంశంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రావణ కుమారి, ఏపీఎం శ్రీదేవి, ఎంఈవో హరనాథ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నాగేశ్వరరావు గ్రామాభివృద్ధికి గ్రామ సభలలో చర్చించాల్సిన అంశాలను వివరించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో జయరామ, సర్పంచులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజాతీయ కళాశాలకు దగ్గరలోని తాతారావు కాలనీ వద్ద మంగళవారం గుర్తుతెలియని మృతదేహాన్ని ఇనకుదురు పోలీసు లు కనుగొన్నారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు ఇనకుదురుపేట పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలని సీఐ పరమేశ్వర్ తెలిపారు.

